విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 30 జనవరి 2025 8 పేజీలు

ఈ-వాహన్ కష్టాలు

- ఆన్‌లైన్ సేవలపై నిలువు దోపిడీ
- అడిగింది ఇస్తేనే అప్రూవల్
- ఆర్.టి.ఒ.ల ఇష్టారాజ్యం

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు.. క్షణాలలో మీ వాహనాల రిజిస్ట్రేషన్ దగ్గర నుంచి బదిలీల వరకు ఇట్టే వేళ్ల మీద చేసేసుకోవచ్చు. వీటికోసం ఇకపై సమయాన్ని వృధా చేసుకోవాల్సిన పనిలేదు. అంతా ఆన్‌లైన్‌లో జరిగిపోతాయి. ఇది కేంద్ర ప్రభుత్వ రవాణా మంత్రిత్వ శాఖ చెబుతున్న మాట. దీనికోసం గతంలో ప్రతి రాష్ట్రానికి ఉన్న యాప్ లను తొలగించేసి వాటి స్థానంలో ఈ-వాహన్ అనే యాప్‌ను తీసుకొచ్చింది. దేశంలో ఉన్న వాహనాలకు సంబంధించిన అన్ని సేవలు ఎక్కడైనా పొందేలా, కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఆన్ లైన్‌లో క్షణాలలో పూర్తి చేసుకునేలా వెసులుబాటు కల్పించామనేది కేంద్ర ప్రభుత్వ శాఖల మాట. అయితే కేవలం మాటలకే పరిమితమైంది. పర్యవేక్షణ కొరవడటమో..! లేక మామూళ్లకు అలవాటు పడటంవలననో చేతులు తడపకుండా అప్రూవల్ ఇవ్వడానికి అనుమతులు రావడం లేదు.

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: జిల్లాలో కొందరు రవాణా శాఖాధికారులు ఆన్ లైన్ దరఖాస్తులను తొక్కిపెట్టి...దరఖాస్తుదారులను కార్యాలయాలకు పిలిపించుకుని లంచాలు దండుకున్న తర్వాతే ఓకే చేయటం..లేదంటే కాగితం లేదంటూ తిప్పుతూనే ఉన్న పరిస్థితి. చివరకు ఇన్సూరెన్స్ వివరాలు ఆన్ లైన్ లోనే కనిపిస్తున్నా దానికి సంబంధించిన పేపర్ చూపాలంటూ తిప్పి పంపడం వంటివి వసూళ్లకు పరాకాష్ఠ.ఆన్ లైన్ లో ఒక్క బటన్ క్లిక్ తో ఓకే చేయగలిగిన ఈ-కేవైసీ,ఫోన్, ఆధార్ నంబర్ల అప్‌డేషన్, మండల, జిల్లాల వివరాల సవరణ వంటి వాటిని వదలకుండా ప్రతిపనికి రేటు పెట్టి దోచేస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసిన ఈ-ప్రగతి యాప్ ద్వారా అయితే మొదటి దరఖాస్తు పరిష్కారం చూపాకే రెండో దరఖాస్తు ఓపెన్ అయ్యేది. దీనివల్ల మామూలు అందినా... లేకున్నా... దరఖాస్తులన్నీ వరుస క్రమంలో క్లియర్ చేయాల్సి వచ్చేది. కానీ ఈ-వాహన్ యాప్‌లో ఆ పరిస్థితి లేదు. అప్లికేషన్ నంబర్ కొడితే ఓపెన్ అవుతుండడంతో వారికి డబ్బు ముట్టిన దరఖాస్తులను ఓకే చేసి.. మిగిలిన వాటిని పక్కన పెట్టేస్తున్నారు. దీంతో నెలల తరబడి ఆన్ లైన్ దరఖాస్తులు పెండింగ్ పడిపోతూనే ఉన్నాయి. ఆన్‌లైన్ ▶మిగతా 2లో..

సీఎం పర్యటనకు సమన్వయంతో ఏర్పాట్లు

విశాలాంధ్ర-కొవ్వూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫిబ్రవరి ఒకటవ తేదీన జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పర్యటన విజయవంతం చేయాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటో గ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశం మందిరంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై కలెక్టర్ పి. ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ దేవ కుమార్‌లతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ▶మిగతా 2లో..

హామీల అమలులో చేతులెత్తేసిన చంద్రబాబు

చెల్లిబోయిన వేణు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ఎన్నికల ముందు అమలు కాని హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులెత్తేసిన చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలను మోసం చేసారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరిజిల్లా అధ్యక్షులు చెల్లిబోయిన వేణు విమర్శించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1994-99 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్నపుడు చంద్రబాబునాయుడు కోటి వరాలు ప్రకటించారని, 2024 ఎన్నికల్లో బిజెపి, జనసేన పార్టీలతో కలిసి అనేక వాగ్దానాలు చేసారని అన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి , ప్రజలను మోసం చేసారని, చంద్రబాబు తీరు ఎన్నిలకు ఒకలాగా ఎన్నికల తరువాత మరొకలాగా ఉంటుందన్నారు. అధికారం కోసం చంద్రబాబు ఎన్ని అబద్ధాలైనా ఆడతారని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల వలన ఆరు సూత్రాలు అమలు చేయలేకపోతున్నామని చెప్పడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేసారు .

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా రెవిన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర -భీమవరం: ఇంటర్ ప్రాక్టికల్, పబ్లిక్ పరీక్షలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ డిఆర్‌ఒ ఛాంబర్‌లో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, పబ్లిక్ పరీక్షలు నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా రెవిన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రాక్టికల్, పబ్లిక్ పరీక్షలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 2025 పబ్లిక్ పరీక్షలలో భాగంగా ఫిబ్రవరి 1వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యుయేషన్ ఎడ్యుకేషనల్ పరీక్ష, ఫిబ్రవరి 3వ తేదీన ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష, ఫిబ్రవరి 5వ తేదీవ నుండి 20 తేదీ వరకు ప్రాక్టికల్ ఎగ్జామ్స్, జనరల్ ఒకేషనల్ కోర్సులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రధాన పరీక్షలు మార్చి 1, 2025 నుండి మార్చి 20, 2025 వరకు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి 19,775 మంది విద్యార్థులు, రెండవ సంవత్స రానికి 18,128 మంది విద్యార్థులు మొత్తం 37,903 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఆయా పరీక్షా కేంద్రాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరైన వెలుతురు, గాలి వచ్చేలా చూడాలని అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు సూపర్వైజర్లు, ఇన్విజిలేటర్లు ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులుకు ▶మిగతా 4లో..

పేదల సొంతింటి కల సాకారం చేయాలి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-ఏలూరు: ప్రతి పేద కుటుంబానికి పట్టణాలలో 2 సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇంటి స్థలం మంజూరు చేసి సొంతింటి కల సాకారం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పేద కుటుంబాలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు కేటాయించాలని బుధవారం సిపిఐ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల ఆధ్వర్యంలో స్థానిక రామచంద్ర రావు పేటలో ఇళ్ల స్థలాల అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న మన్నవ కృష్ణ చైతన్య మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం ఇంటి స్థలం కోసం ఇచ్చిన హామీ అమలులో జాప్యం జరగడంతో ఇళ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున అర్జీలు దరఖాస్తు చేయడానికి తరలి వస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు పొంది ఇంటి నిర్మాణం పూర్తి కాని వారికి జీవో సవరించి పట్టణంలో రెండు,గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇవ్వాలని కోరారు. ఫిబ్రవరి 10వ తేదీన అర్జీదారులను సమీకరించి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పిస్తామని తెలిపారు. స్పందించని పక్షంలో ప్రభు త్వంపై వివిధ రూపాల్లో ఒత్తిడి తీసుకొస్తా మని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు, బేతా శంకర్, కే రోజా, బి.లక్ష్మి, ఎ. మల్లేశ్వరి,శ్రావణి,ఉమా గౌరీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ జారీ : కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర బ్యూరో- ఏలూరు: ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్, ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటుచేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వివరాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ▶మిగతా 4లో..

రీ సర్వే పనుల పరిశీలన

విశాలాంధ్ర -లింగపాలెం: గణపవారిగూడెంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను తహసిల్దార్ నజీమ్ పరిశీలించారు.ఈ గ్రామాన్ని మోడల్ విలేజిగా ఎంపిక చేసి రీసర్వే చేపట్టారు. గ్రామంలో దాదాపు 500 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు. ఈ భూములకు సంబంధించి ఖచ్చితమైన వివరాలను సర్వేయర్ల

బృందం నమోదు చేస్తున్నారు.110 ఎకరాలకు సంబంధించి రీసర్వే పూర్తి చేశారు. భూముల హద్దులను గుర్తించడంలో రైతుల నుంచి వివరాలు తీసుకుంటున్నారు. గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను తహసిల్దార్ పరిశీలించి పలు సూచనలు చేశారు. రీ సర్వే వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, భవిష్యత్తులో భూమి వివాదాలు తలెత్తకుండా సర్వే జరుగుతోందని అన్నారు.భూమి ఉన్న ప్రతి రైతు రీసర్వేకు సహకరించాలని కోరారు. అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలించి సక్రమంగా నమోదు చేస్తామని రైతులు గమనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ నాగబాబు, మండల సర్వేయర్లు ప్రేమ కుమార్, రామాంజనేయులు, గ్రామ సర్వే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడి స్మారక అవార్డుకు మైలవరపు రవికిరణ్ ఎంపిక

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం: ప్రముఖ పాత్రికేయుడు, సుప్రసిద్ధ సామాజిక కార్యకర్త కీ.శే. యద్దనపూడి సూర్యనారాయణమూర్తి స్మారక ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారానికి మైలవరపు రవికిరణ్ ఎంపికయ్యారు. ఈ విషయాన్ని అవార్డు ఎంపిక కమిటీ కన్వీనర్ డి.సోమసుందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డు కోసం వచ్చిన ఎంట్రీలను పరిశీలించి 2024 సంవత్సరానికి ఏడాది పొడవునా రాసిన ప్రత్యేక

వార్తా కథనాలకు తాడేపల్లిగూడెం ఆంధ్రజ్యోతి విలేఖరి రవికిరణ్ ను అవార్డు కమిటీ ఎంపిక చేసినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.యద్దనపూడి పేరిట జిల్లాలోని సీనియర్ పాత్రికేయులకు చేస్తున్న గౌరవసత్కారానికి ఘంటా వేణుగోపాల్ (వార్త, భీమవరం),సి.హెచ్. రామకృష్ణరాజు (సాక్షి, ఏలూరు),పాలడుగుల రామకృష్ణ(ఎ.బి.ఎన్, జంగారెడ్డిగూడెం)ను ఎంపిక చేసినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. యద్దనపూడి సూర్యనారాయణ మూర్తి 14 వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 31 వ తేదీన తాడేపల్లిగూడెం జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ - ప్రెస్ క్లబ్,ఎ.పి.యు.డబ్ల్యూ.జే. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం, సిపాయిపేట, భవననిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో జరిగే సమావేశంలో అవార్డు ప్రదానం, గౌరవసత్కారాలు జరుగుతాయని తెలిపారు.

జట్లపాలెంలో ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర - పెంటపాడు : పాడి పశువుల ఆరోగ్యం పట్ల రైతులు శ్రద్ధ వహించాలని జట్లపాలెం పశు వైద్యాధికారిణి చాత్రాతి మౌనిక అన్నారు. పెంటపాడు మండలం పరిధిలోని జట్లపాలెం గ్రామం లోని పశువైద్యశాలలో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు.ఈ

సందర్భంగా పశు వైద్యాధికారిణి చాత్రాతి మౌనిక మాట్లాడుతూ శిబిరంలో 30 మంది రైతులకు సంబంధించిన 148 పశువులకు వివిధ రకాల వ్యాధులకు సంబంధించి చికిత్సలు చేసామన్నారు. వీటితోపాటు నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరిగిందని,15 గేదెలకు సూడి పరీక్షలు చేశామని,రెండు గేదెలకు ఎద ఇంజక్షన్లు చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుమిల్లి పశు వైద్యులు డాక్టర్ బి.క్రాంతి, వెటర్నరీ అసిస్టెంట్ ఎం.హారిక, హాస్పటల్ అటెండెంట్ జి.ప్రసాద్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఎం.ప్రదీప్, పశు వైద్య సహాయకులు బివి.శివకృష్ణ, పీఎస్ఎన్వి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు (1వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా ఫిబ్రవరి ఒకటవ తేదీన కొవ్వూరు నియోజక వర్గంలో గృహ ప్రవేశం కార్యక్రమం, ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఆయా శాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లను ప్రణాళిక బద్ధంగా చేసి విజయవంతం చేయాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, పారిశుధ్య ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. హెలిపాడలో పటిష్టమైన బారికేడ్లు చేపట్టాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. బయో టాయిలెట్, మున్సిపల్, మరియు డిపిఓ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు, నిరంతరం విద్యుత్ ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు, అనంతరం కలెక్టర్, ఎస్పీ, ఎమెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు, జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, ఆర్డీవో సుస్మిత, హౌసింగ్ పీడీ డి. భాస్కర్ రెడ్డి, పీడీ డిఆర్డిఏ ఎన్వీవీఎస్ మూర్తి, ఎస్ఈ ఏపీఈపిడిసిఎల్ తిలక్, ఇతర అధికారులు, స్థానిక నాయకులు జే. సుబ్బారాజు చౌదరి, కే. రామకృష్ణ, తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో పెన్షన్, గృహ ప్రవేశాలు నిర్వహించే ఏర్పాట్లను , కాపవరం మార్కెట్ యార్డు వద్ద హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ వాహన్ కష్టాలు

(1వ పేజీ తరువాయి)

దరఖాస్తు చేసిన వారు నెలల తరబడి ఎదురు చూసి, చివరకు ఆర్టీవో కార్యాలయానికి వెళ్లక తప్పడం లేదు. దీంతో కేంద్రం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ-వాహన్ కొందరు వసూళ్ల అధికారులకు వరంగా మారింది.

ఆఫ్ లైన్ లో చేతులు తడిపితేనే....

కేంద్రం దేశవ్యాప్తంగా తీసుకువచ్చిన ఈ-వాహన్ యాప్ ద్వారా కొత్త వాహనాల రిజిస్ట్రేషన్, యాజమాన్య బదిలీ, జాతీయ, అంతర్జాతీయ అనుమతుల మంజూరు, పునరుద్ధరణ, వాహన భీమా, వాహన ఫిట్నెస్ సర్టిఫికెట్ వంటివి మంజూరు చేయడం దగ్గర నుంచి ఈ-కేవైసీ వంటి వాటి వరకు వాహనదారులు అన్నీ ఆన్ లైన్ లో చేసుకునే వెసులుబాటు ఉంది. కొత్త యాప్ తీసుకొచ్చి సేవలన్నీ ఆన్ లైన్‌లో అందిస్తోంది కదా! ఎంచక్కగా ఇంటి దగ్గరే ఉండి అన్నీ చేసుకోవచ్చు అనుకునే వారికి మాత్రం నిరాశ తప్పడం లేదు. లారీలు, బస్సుల వంటి వాహనాలు బ్రేక్ చేసి, ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలంటే ప్రభుత్వ చలానా రూ.970 చెల్లించాలి. ఇది రెండు నెలల ఫీజు. ఈ మొత్తం చెల్లించి అన్ని కాగితాలు ఆన్ లైన్‌లో అప్ లోడ్ చేసి, వాహనాన్ని చూపితే ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలి. కానీ చలానా మొత్తం కాకుండా అదనంగా రూ.3 వేలు మామూళ్ల కింద చెల్లించాలి.ఇది ఎప్పటి నుంచో ఉన్న ఆనవాయితీనే. అయితే వాహన్ యాప్ ద్వారా కేంద్రం కొత్త అవకాశాన్ని తీసుకువచ్చింది. నేషనల్ పర్మిట్, అంతర్ రాష్ట్ర అనుమతులు ఉన్న లారీలకు పర్మిట్ అయిపోతే దానిని ఎక్కడ ఉంటే ఆ దగ్గరలోని ఆర్టీవో కార్యాలయంలో రెన్యువల్ చేయించుకునే అవకాశాన్ని కల్పించింది.ఎక్కడ చేయించినా గతంలో నిర్ణయిం చిన లంచాలకు తోడు అదనంగా రూ.2 వేల వరకు చెల్లించుకోవాల్సిందే. ఇదేమిటని ప్రశ్నిస్తే ఎక్కడ వాహనం అక్కడ చేయించుకునేం దుకు వెళితే ఆయిల్ ఖర్చు అవుతుంది కదా..! మీకు అదంతా ఆదా చేస్తున్నాం కదా అని చెప్పి వసూలు చేయడం విశేషం.

ఆర్.సి. కార్డులు లేవు....

కొత్త వాహనం రిజిస్ట్రేషన్ చేసుకుంటే దానికి సంబంధించిన ఆర్.సి.కార్డు వాహన యజమానికి అందాలి. దీనికోసం 2023 నుంచి కొత్త వాహనాలు కొన్న వారంతా ఎదురుచూస్తున్న పరిస్థితి. కార్డు కావాలంటే రూ.225 చెల్లించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ కాలంలో కార్డ్‌తో పని లేకుండా ఆర్.సి.పేపర్ డౌన్ లోడ్ చేసుకుని దానిని కార్డు లాగా తయారు చేసుకుని అవకాశం కల్పించారు. అప్పటికే కార్డు కోసం డబ్బు చెల్లించిన వారి పరిస్థితిపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చాక కచ్చితంగా కార్డు తీసుకునేలా రూ.225 చెల్లించాల్సిన విధంగా యాప్‌లో మార్పులు చేశారు. ఈ సమయంలో వాహనాలు కొన్న వారంతా చెల్లించారు.కానీ వారికీ కార్డులు లేవు. ఇటీవల మళ్ళీ దానిలోను మార్పులు చేసి కార్డు కావాలా, వద్ద అనే ఆప్షన్‌ను ఆన్ లైన్ లో ఇచ్చారు.కావాలనుకునే వారు డబ్బు చెల్లించాల్సి ఉంటుంది. లేనివారు పేపర్ డౌన్ లోడ్ చేసుకుని దానినే ఆర్.సి. కింద చూపించవచ్చు. అయితే కార్డు కావాలని మళ్లీ డబ్బు చెల్లించిన వారికీ కష్టాలు యధావిధిగానే కొనసాగుతున్నాయి. కార్డులు రాకపోగా ఆ వాహనాన్ని అమ్మాలంటే కొర్రీలు పెడుతున్నారు. కార్డు రానివారు వాహనం అమ్మబోతే.. యాజమాన్య బదిలీకి కుదరదు.దీంతో వాహన దారులు రెండు రకాలుగా అవస్థలు పడుతున్నారు. అసలు కార్డులు ఎక్కడ నుంచి వస్తాయో కూడా అంతు పట్టని విషయం.వీటి కోసం కార్యాలయాలలో అడిగితే మాకు ఏ సమాచారం లేదు, ప్రభుత్వ నుండి అనుమతులు రావాలి అనే సమాధానం మినహా దానికి పరిష్కార మార్గం చూపిన వారే లేరు. దీంతో వాహనాల అమ్మకాలు పెండింగ్‌లో పడిపోతున్నాయి. వాహనాలు కొనాలన్నా.. అమ్మాలన్నా.. రెండవ వాహనం ఉండడం వలన ఎక్కువ పన్నులు చెల్లించాల్సి రావడంతో ఆ నష్టాన్ని వాహనదారులు భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ-వాహన యాప్ వచ్చి చాలాకాలం అయినా, బాలారిష్టాలు అధిగమిం చినా అధికారుల అలసత్వం, మామూళ్ల మత్తు లక్ష్యాన్ని నీరు కార్చుతోంది. దీనిపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయి అజమాయిషి ఉంటేనే ఆన్ లైన్ సేవలు సక్రమంగా వాహనదారులకు అందే అవకాశం ఉంది. ప్రభుత్వ పెద్దలు దీనిపై దృష్టి పెడితేనే కొత్త, పాత వాహనాలు ఏ అడ్డంకులూ లేకుండా రోడ్డెక్కే అవకాశం ఉంది.

CHANGE OF NAME

I, **KOTHAMASU NAGA VENKATA SWETHA W/o Kothamasu Manikanta Sumanth,** Ashok Nagar, Eluru, Eluru Dt., AP. I have changed my name from **VANKADARU NAGA VENKATA SWETHA (Old name) to KOTHAMASU NAGA VENKATA SWETHA (New name)** hence forth I am being called **KOTHAMASU NAGA VENKATA SWETHA W/o. Kothamasu Manikanta Sumanth** for all purposes.

పాస్‌పోర్ట్ పోయినది

సూరిశెట్టి పాల్, S/o.లాజర్, ఇంటి నెం. 1-17, 1వ వార్డు, కొమరాడ (గ్రా), భీమవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా., నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం.**U1846835**ను ఒక బ్యాగులో పెట్టుకుని ది.28.12.2024వ తేదిన కొమరాడ గ్రామం నుండి భీమవరం టౌనుకు జిరాక్స్ తీయునిమిత్తం మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యంలో సదరు నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పెట్టిన బ్యాగ్ జారిపడి పోయినది.

ఎంత వెదికిననూ దొరకలేదు.కావున ఎవరికైననూ దొరి కిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అందజేయగలరు

సెల్: 7330624893

ఏఐఎం జిల్లా ఇంచార్జిగా బండి మధు

విశాలాంధ్ర -ఉండి : అంబేద్కర్ ఇండియన్ మిషన్ పశ్చిమగోదావరి జిల్లా ఇంచార్జిగా బండి మధుని, జిల్లా కన్వీనర్‌గా అల్లూరి చిన్నారావును, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జిగా మాంద్రు ధర్మేంద్రను నియమించినట్లు ఆ సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ కంకి

హరికృష్ణ ఒక ఉత్తర్వు లో పేర్కొన్నారు. బండి మధు తమ నియామక పత్రం గురువారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఏఐఎం సంస్థ బలోపేతం చేయడానికి ఉత్తమంగా పనిచేసే కొందరు వ్యక్తులను నియమించినట్లు మధు వెల్లడించారు. బాధితులు చేపట్టిన మధును పలువురు వ్యక్తులు అభినందించారు. సంస్థ విస్తరణకు అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానని మధు తెలిపారు.

ఉండి లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట

విశాలాంధ్ర - ఉండి : గణపవరంలో బుధవారం లయన్ జోన్ శాంతి సమావేశం జరిగింది . సమావేశంలో జోన్ ఛైర్మన్ రామ్మూర్తి చేతుల మీదుగా ఈ ఏడాది ఉత్తమ సేవలు అందించి నందుకు ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షులు సత్తి

బ్రహ్మారెడ్డికి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు, బెస్ట్ సెక్రటరీ అవార్డు ఉండి లయన్స్ కార్యదర్శి ముదునూరి శివరామరాజుకు బెస్ట్ ట్రెజరర్ అవార్డు ఉండి కోశాధికారి పాలతీర్థపు నరసింహారావు కు దక్కాయి. ఈ అవార్డులను క్లబ్ అడ్మినిస్ట్రేషర్ రుద్రరాజు నరసరాజు, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గాదిరాజు రంగరాజు, రుద్రరాజు యువరాజు, పెన్మెత్స రంగప్రసాద్ రాజు, గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు, వాళ్ల తరపున స్వీకరించారు.

పాఠశాలకు భోజన ప్లేట్లు వితరణ

విశాలాంధ్ర- నూజివీడుటౌన్: విశ్రాంత ఉపాధ్యాయులు షేక్ అబ్దుల్ హాక్ తను పని చేసిన స్థానిక ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలకు సొంత నిధులతో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన 100 భోజన

ప్లేట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయిని డాక్టర్ బి. హేమలతకు బుధవారం అందజేశారు. సదరు ఉపాధ్యాయుడి సేవా దృక్పథాన్ని ప్రధాన ఉపాధ్యాయురాలితో తోటి ఉపాధ్యాయులు కొనియాడి అభినందించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు మాటూరు సుధీర్ ఆధ్వర్యంలో స్థానిక వి ఎస్ ఎన్ కళాశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రామచంద్ర శంకర నేత్ర చికిత్సలయం వారు 100 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ మానవతా

స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని దీనిలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి సాయి కృష్ణ, త్రిపుర రమేష్, మోటమర్రి ఉమామహేశ్వరరావు, వెత్స స్వామి, నక్క బాబి, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, మందపాటి రామకృష్ణ, రామ్మోహనరావు, చంటిబాబు, శేఖర్, కంటి వైద్య నిపుణులు ఎండి నాగూర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం దృష్టికి కొల్లేరు ప్రజల సమస్యలు

ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హామీ

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు : కొల్లేరు ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న ప్రజల సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హామీ ఇచ్చారు.

ఏలూరు శాంతినగర్‌లోని ఎంపీ మహేష్‌కుమార్ క్యాంపు కార్యాలయ ప్రతినిధులను ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, కొల్లేరు పరిరక్షణ సమితి నాయకులు యేసు రాజు, సత్యనారాయణ,బీకేఎం నాని, కొల్లి బాబి, తదితరులు కలిసి కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలతో కూడిన సమగ్ర నివేదికను బుధవారం అందజేశారు. అనంతరం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల నేపథ్యంలో కొల్లేరు ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, కొల్లేరు పరిరక్షణ సమితి నాయకులు ఎంపీ మహేష్ కుమార్ కు ఫోన్ లో వివరించారు. గతంలో చంద్రబాబు నాయుడు కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపారని,గత వైసిపి ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పట్టనట్లు వ్యవహరించడం వల్ల కొల్లేరు సమస్య మొదటికొచ్చిందని పరిరక్షణ సమితి నాయకులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కైకలూరులో జరిగిన సమావేశంలో తీర్మానించిన వివరాలు, కొల్లేరు ప్రాంత ప్రజల అభిప్రాయాలను త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ని కలిసి వివరిస్తానని ఎంపీ మహేష్ కుమార్ కొల్లేరు పరిరక్షణ సమితి నాయకులకు భరోసా ఇచ్చారు.

జగన్ పాలనలో ఆర్థికవ్యవస్థ దివాళా : ఎమ్మెల్యే బడేటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : గత ఐదేళ్ళ వైసిపి పాలనలో జరిగిన ఆర్థిక అరాచకాల కారణంగా రాష్ట్రం పూర్తిగా దివాళా తీసిందని, చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడం కూటమి ప్రభుత్వానికి గుదిబండై ప్రజల పాలిట శాపంగా మారిందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

బుధవారం ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చంటి విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ళ తన దుర్మార్గ పాలనలో 19, 871 కోట్ల రూపాయలను తన విలాసాలు, జల్సాలకు ప్రభుత్వ ధనాన్ని దుబారా చేశారని బడేటి చంటి విమర్శించారు. ఐదేళ్ళ అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్మోహన్ రెడ్డి 8 లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ధ్వజమెత్తారు. ఏడాదికి 71 వేల కోట్ల రూపాయలు అసలు, వడ్డీ చెల్లించాల్సి రావడంతో చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండగా మారిందని ఆయన పేర్కొన్నారు. గడిచిన 7 నెలల్లో ఆరోగ్య శ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటి వాటికి జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయిలు 22 వేల కోట్ల రూపాయలను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందని ఆయన చెప్పారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసి జగన్మోహన్ రెడ్డికి కూటమి ప్రభుత్వం మర్చిపోలేని గుణపాఠం చెప్పి తీరుతుందని బడేటి చంటి స్పష్టం చేశారు.

జగన్ పాలనలో ఆర్థిక విధ్వంసం

విశాలాంధ్ర -భీమవరం : రాష్ట్రంలో గడిచిన జగన్ ఐదేళ్ల పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన టిడిపి చంద్రబాబు ప్రభుత్వం లోటు బడ్జెట్ తో అనేక సవాళ్లను ఎదుర్కొని రాజధాని లేని ఏపీకి అమరావతి రాజధానిగా, ప్రతి

సోమవారం పోలవరం నిర్మాణానికి కేటాయించి అత్యంత వేగవంతమైన సుస్థిర పరిపాలన అందించారన్నారు.జగన్ పాలనలో అప్పుల ఊబిలో ఉన్న ఏపీ బీహార్ కన్నా దారుణ పరిస్థితి నెలకొని ఉన్న ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా పెన్షన్ పెంపు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అనేక సంక్షేమ పథకాలను వరుసగా అమలు చేసుకుంటూ వస్తున్నారని అన్నారు. ఎన్ని ఆర్థిక సమస్యలు ఎదురైనా సంక్షేమం పక్కాగా అమలు చేసే సమర్థత చంద్రబాబు కుందని తెలిపారు.

నివేశన స్థలాలివ్వాలి

విశాలాంధ్ర -భీమవరం : ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని వారందరికీ నివేశన స్థలాలు కల్పించాలని, ఇళ్లపై చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. కూటమి సర్కారు ఎన్నికల్లో ఇళ్ల స్థలాలపై ఇచ్చిన హామీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మూడో రోజు సీపీఐ భీమవరం ఏరియా సమితి ఆధ్వర్యంలో ఎఫ్.సి.ఐ రోడ్డు తదితర ప్రాంతాల్లో పేదల నుంచి ఇళ్ళ స్థలాల కై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ జగన్ ఇచ్చిన చాలీచాలని ఇళ్ల స్థలాల్లో పేదలు ఎలా నివసిస్తారని తాము పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెట్లు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని కూటమి హామీ ఏమయ్యిందని ప్రశ్నించారు. ఇళ్ల స్థలాలపై

కూటమి సర్కారు మెలికలు పెట్టడం సరికాదని ఉత్తుత్తి జీఓలు చేతులు దులుపు కోవడం కుదరదని, నివేశనా స్థలాలు ఇవ్వకపోతే ప్రజలతో కలిసి ఉద్య మాలు నిర్మిస్తామని ఆయన హెచ్చరిం చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వై.వి.ఆనంద్, ఎం.లక్ష్మీపతి, టిడిపి నాయకులు చెల్లబోయిన సుబ్బారావు, పాలా దాసు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించేందుకు ముందస్తు ప్రణాళిక

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీరు అందించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు చెప్పారు. ఇందులో భాగంగానే నగర ప్రజలకు 40 రోజులకు సరిపడా మంచినీరు నిల్వలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో ఉన్నట్లు వివరించారు. ప్రస్తుతం ఉన్న మంచినీటిని జాగ్రత్తగా వినియోగించకపోతే వేసవి కాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదని స్పష్టం చేశారు. వేసవి పరిస్థితులపై ప్రభుత్వ ముందస్తు సంకేతా లను దృష్టిలో పెట్టుకొని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆదేశాల మేరకు కో-ఆప్షన్ సభ్యులు పెదబాబు బుధవారం మున్సిపల్, అధికారులు, కార్పొరేటర్ల బృందంతో కలిసి దెందులూరులో ఉన్న గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. అక్కడ పరిస్థితులు చూసి సుమారు 40 రోజుల వరకు సరిపడా గోదావరి జలాలు ట్యాంకులో ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ రానున్న వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజలు మంచినీటిని

జాగ్రత్తగా వాడుకోవాలని లేని పక్షంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని నగర ప్రజలకు సూచించారు. గోదావరి జలాలను పంపింగ్ చేసే 150 హెచ్పి మోటర్ ఎక్కువగా మరమ్మతులకు గురికావడంతో గోదావరి జలాలను చెరువులోకి పూర్తి స్థాయిలో పంపింగ్ చేయలేక పోతున్నామన్నారు. వాటి స్థానంలో తక్షణమే 50 హెచ్పి మోటార్లను బిగించి గోదావరి జలాలను ఎస్ఎస్ ట్యాంకులో నింపుతున్నామన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ సురేంద్రబాబు, డిఈలు రజాక్, తాతబ్బాయి, ఎలక్ట్రికల్ ఏఈ సాంబశివరావు, కార్పొరేటర్లు జున్నూరు కనక నరసింహారావు, సబ్బన శ్రీనివాసరావు, బత్తిన విజయకుమార్, దేవరకొండ శ్రీనివాసరావు, పాము శామ్యూల్, నున్న కిషోర్, ఇదిపల్లి పవన్, చలువాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమ ఉత్సవాలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పోలవరం: ఫిబ్రవరి 26న జరిగే శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఉత్సవాలకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా చూడాలని ఉత్సవ కమిటీ చైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎంవి రమణ అన్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో బుధవారం పట్టిసీమ పుణ్యక్షేత్రం రేపు వద్ద సమీక్షా సమావేశం నిర్వహించారు. గోదావరి నది మధ్యలో జరిగే ఈ ఉత్సవాలకు దూర ప్రాంతాల నుండి భక్తులు వస్తారని, వారికి గోదావరిపై అవగాహన ఉండదన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హరిసూరి ప్రకాష్ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామని మెట్లు ప్రాంతంలో గతం కంటే

ఎక్కువగా టెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ గోదావరి నది మధ్యలో జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు ఎక్కువ వస్తారని వారిని ఉద్దేశించి ఉన్నతాధికారులకు, ఆయన సలహాలు సూచనలు ఇచ్చారు. డీఎస్పీ వెంకటేశ్వర రావు, ఆర్‌టిఓ ఎండి మదాని, బాల సురేష్ బాబు, తహసిల్దార్ సాయి రాజు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, సర్పంచ్ శ్రీరామమూర్తి, అధికారులు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: ప్రజల అవసరార్థం, మరణించిన వారి కోసం బాడీ ఫ్రీజర్ బాక్స్ మండలంలో అందుబాటులో లేకపోవడంతో ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిన్న మొన్నటి వరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఫ్రీజర్ బాక్స్ ప్రస్తుతం మరమ్మతులకు గురవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎవ్వరైనా మరణిస్తే వారిని భద్రపరిచి బంధువులు లేదా దూరప్రాంతాన ఉన్న కుటుంబీకులకు కడసారి చూపు ఏర్పాటు చేయడానికి ఇక్కడి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఒక్కో సారి డెడ్ బాడీని రెండు మూడు రోజులు భద్రపరచాల్సి వస్తే, బాడీ ఫ్రీజర్ బాక్స్ స్థానికంగా అందు బాటులో లేక దూరప్రాంతాలకు వెళ్ళి అధిక రెంట్, అధిక ఆటో కిరా యిలు చెల్లించి తీసుకు రావాలంటే నానా అవస్థలు పడుతున్నట్లు ఏజెన్సీ ప్రజలు అంటున్నారు. పాడైన ఫ్రీజర్ బాక్సు ను బాగుచేయించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని లేదా ఎవ్వరైనా దాతలు స్పందించి ఫ్రీజర్ బాక్స్‌ను ప్రజలకు అందించాలని బుట్టాయిగూడెం ప్రజలు కోరుతున్నారు.

ఈవిఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవిఎం గోదామును జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా బుధవారం కలెక్టర్ వెట్రిసెల్వి ఈవిఎం గోదామును సందర్శించి షట్టర్లకు ఉన్న సీల్లను, ఫైర్ఎక్స్ టింగ్విషర్‌లను, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు.

ఈవిఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ భద్రతా విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని జంగారెడ్డిగూడెం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎస్ఎస్ రంగనాయకులు తెలిపారు. జాతీయ రహదారి భద్రత

మాసోత్సవాల్లో భాగంగా టి నరసా పురంలో ఆటో-ట్రక్ యూనియన్ , రవాణా శాఖ సంయుక్తంగా బుధవారం రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రంగనాయకులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఇరువైపులా ప్యాసింజర్లను కూర్చోబెట్టుకుని ప్రయాణం చేయరాదని సూచించారు. మద్యం సేవించి వాహనమును నడపడం ప్రమాద కరం అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆటో నడపరాదని ,రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానం చేరాలని సూచిం చారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలను నడపడం శ్రేయ స్కరం అన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ సురేష్‌బాబు, ఎఎస్ఐ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1 నుంచి వంతుల వారీ విధానం

విశాలాంధ్ర -భీమవరం: గోదావరి నదిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున గోదావరి పశ్చిమ డెల్టా 11 ప్రధాన కాలువలకు వంతుల వారి విధానం ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు నరసాపురం ఇరిగేషన్ సబ్ డివిజన్ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ సిహెచ్ వెంకట నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతుల వారి విధానం రెండు వంతులుగా ఉంటుం దని మొదటి వంతు ఆరు రోజులు, రెండో వంతు ఆరు రోజులుగా అమలు చేయడం జరుగుతుందని రైతాంగం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గిరిజన ఆవాసాలలో మౌలిక సదుపాయాలు కల్పించండి : సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: 180 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్న ప్రాంతానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ మండల కార్యాలయ కన్వీనర్ చోడం దుర్గ అన్నారు. బుధవారం కెఆర్ పురం ఐటిడిఏ పిఓ రాములు నాయక్ కు రామన్నగూడెం గిరిజన సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామన్నగూడెం రెవెన్యూ పరిధిలో 4-1 సర్వే నెంబర్‌లో రామన్నగూడెంకు చెందిన 180 గిరిజన కుటుంబాలు గృహాలను నిర్మించుకొని జీవిస్తున్నారని, ఆ భూమిని ఆ గ్రామానికి చెందిన కొంతమంది స్వార్థపరులు సీతారామ దేవస్థాన భూమిగా నమోదు చేయించారని తెలిపారు. అందువలన అక్కడ గిరిజనులకు ఎటువంటి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. ఆ భూమిలో వాటర్ ట్యాంక్, అంగన్వాడీ, హాస్పిటల్ మొదలగు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్నారు. దేవస్థానం భూమిగా నమోదు కావడం వల్ల అక్కడ ఎటువంటి ప్రభుత్వ సౌకర్యాలు అందటం లేదని, అధికారులు గమనించి గత 40 సంవత్సరాలగా అదే భూమిలో నివసిస్తున్న గిరిజనుల అభివృద్ధికి తారుమారైన రికార్డులను పరిశీలించి దేవస్థానం పేరును తొలగించి రామన్నగూడెం గిరిజనులకు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు, రామన్నగూడెం గిరిజనులు ఉన్నారు.

లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

జెడ్పీ చైర్మన్ పద్మశ్రీ ఆదేశం

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) బీసీ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ చైర్ పర్సన్ క్యాంపు కార్యాలయంలో బిసి యాక్షన్ ప్లాన్ అమలుపై అధికారులతో జెడ్పి చైర్‌పర్సన్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిసిల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. ప్రజల ఆశయాల మేర పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. స్వయం ఉపాధి కోసం అందిన దరఖాస్తులను పరిశీలించి, ఆర్థిక మంజూరు కోసం సంబంధిత బ్యాంకులకు పంపి, బ్యాంకర్లు లోన్లు మంజూరు చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి కేఎస్ఎస్. సుబ్బారావు, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలత పాల్గొన్నారు.

నోటిఫికేషన్

(1వ పేజీ తరువాయి)

విడుదల చేసిందన్నారు. ఫిబ్రవరి,3 వతేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని, ఫిబ్రవరి, 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. నామినేషన్ల పరిశీలన 11వ తేదీన జరుగుతుందని, 13వ తేదీలోగా నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవచ్చున్నారు. ఫిబ్రవరి, 27వ తేదీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఓట్ల లెక్కింపు కార్యక్రమం మార్చి 3వ తేదీన జరుగుతుందని, ఎన్నికల ప్రక్రియ మార్చి ,8వ తేదీన ముగుస్తుందన్నారు. ఉమ్మడి పశ్చిమ,తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని ఏలూరు,పశ్చిమ గోదావరి,తూర్పు గోదావరి,అల్లూరి సీతారామరాజు ,కోనసీమ, కాకినాడ జిల్లాల పరిధిలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు చేయాలి

(1వ పేజీ తరువాయి)

తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 114 సెక్షన్ నిర్వహించాలన్నారు. సమీపం లోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాల న్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష నిర్వహణ తేదీలలో నిర్దేశించిన సమయాలకు ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు శానిటేషన్, త్రాగు నీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలోను సీసీ కెమెరాలతో నిఘ ఉంటుందని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ పాల్పడకుండా ఉండాలని అన్నారు. సమావేశంలో డిఐఈఓ ఏ.నాగేశ్వర రావు, జిల్లా స్పెషల్ ఆఫీసర్ వీ.కే.మల్లేశ్వరరావు, డిఈసిలు కె.వి.రామారావు, బి.అప్పారావు, ఎం.వి.ఆర్ దేవరాజ్, పోస్టల్ డిప్యూటీ సూపరింటెండెంట్, ఏ.సురేష్ కుమార్, సీఐ డి. వెంకటేశ్వర రావు, ఆర్టీసీ, మెడికల్, మున్సి పల్, పంచాయతీ, ఎడ్యుకేషన్, ఎలక్ట్రికల్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి వరకు హైస్కూలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పదవ తరగతి వరకు హైస్కూల్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ సున్నం శాంతకుమారి మండల విద్యాశాఖ అధికారికి గ్రామస్తులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాంత కుమారి మాట్లాడుతూ మండలంలో దిప్పకాయల పాడు గ్రామంలో ప్రస్తుతం ఎనిమిదవ తరగతి వరకు మాత్రమే ప్రభుత్వ పాఠశాల నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇదే గ్రామంలో పదవ తరగతి వరకు హై స్కూల్ ఏర్పాటు చేయాలని, తొమ్మిదవ తరగతి నుండి పదవ తరగతి వరకు వేరే గ్రామం వెళ్లి విద్యను అభ్యసించవలసి వస్తుందని, ప్రతిరోజు విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలకు వెళ్లి రావడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఇదే గ్రామంలో హైస్కూల్ ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సౌకర్యార్థంగా ఉంటుందని ఆమె తెలిపారు. పాఠశాల ఏర్పాటుకై ఉన్నత అధికారులకు తెలియజేస్తానని ఎంఈఓ సురేష్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి.రామ్మోహన్‌రావు, గెడ సుబ్బారావు, సున్నం వెంకటేష్ , ఆశీర్వాదం, లక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ సమీనా రాణి, దిప్పకాయలపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తి

విశాలాంధ్ర - పాలకొల్లు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి బుధవారం పరిశీలించారు. స్థానిక శ్రీ ఏ.వి.ఎస్.ఎన్ మున్సి పల్ హైస్కూల్లో ఆయన మధ్యాహ్న భోజ నాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల పారిశుద్ధ్య జిల్లా కోఆర్డినేటర్ కె.కృష్ణారావు కూడా పాఠశాల తనిఖీలో యాదృచ్ఛికంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తితో కలిసి, భోజనం చేశారు. మధ్యాహ్న భోజన అమకు తీరు గురించి కృష్ణారావును అడిగి తెలుసుకోవడమే కాకుండా, విద్యార్థులు వంట ఏజెన్సీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృష్ణారావు మధ్యా హ్నం భోజన రికార్డులను గుడ్లు, చిక్కీలు బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఆర్ దీపిక, సి.అర్.పి కే శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

HINDUJA HOUSING FINANCE

CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com

కార్పొరేట్ ఆఫీస్: 167-169, 2వ అంతస్తు, లిటల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600015, తమిళనాడు, ఇండియా. బ్రాంచ్ చిరునామా: హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, నెం.54-20-10/1, ప్లాట్ నెం: 43, 3వ అంతస్తు, ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా, మెయిన్ రోడ్, గురునాంక్ కాలనీ, విజయవాడ-520 008.

డిమాండ్ నోటీసు

మీరు దిగువ రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు, హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ నుండి మీ స్థిరాస్తు/ల తాకట్టుపెట్టుట ద్వారా ఆస్తి వసతు(ల)పై హోమ్ లోన్స్/ లోన్‌ను పొందియున్నారు. మీరు తిరిగిచెల్లించుటలో డిఫాల్ట్ చెందినారు; మీ రుణా/లు నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్‌గా వర్గీకరించబడినవి. చివరిగా తెలిసిన చిరునామాలకు బాకీపడిన బకాయిల రికవరీ కొరకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 క్రింద డిమాండ్ నోటీసు పంపబడినది అయితే అది చేరకుండానే వెనుదిరిగింది. కావున మీకు ప్రత్యామ్నాయ సర్వీసుగా మీకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1)తో చదవగల చట్టంలోని సెక్షన్ 13(2)ప్రకారం అందులోని విషయాలను ప్రచురించబడుతున్నది. రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు, హామీదారు, సెక్యూరిటీస్, బాకీపడిన బకాయిలు, సెక్షన్ 13(2) క్రింద పంపిన డిమాండ్ నోటీసు మరియు క్లెయించేసిన మొత్తం దిగువ ఇవ్వబడినది.

క్ర. సం.	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు /LAN నెం.	ఎన్‌పిఏ తేది	డిమాండ్ నోటీసు తేదీ & బాకీపడిన మొత్తం
1	1) శ్రీ రాజా కొల్లూరి అలియాస్ రాజా ... రుణగ్రహీత, 2) శ్రీ ఉదయరాణి కొల్లూరి ....సహ-రుణగ్రహీత **ఇరువురి నివాసం:** నివాసం: డి.నెం.10-23, యాదవోల్ రోడ్, దేవరపల్లి మండలం, దేవరపల్లి, ప.గో.జిల్లా, సెమిఅర్బన్, రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్, ఇండియా-534313. **Lan No: AP-RAJ-THRD-A000000375 & CO/CPC/CPOF/A000001085.**	05-12-2024	09-01-2025 & రూ.51,34,796/- (రూపాయలు యాభై ఒక్క లక్షల ముప్పై నాలుగు వేల ఏడు వందల తొంభై ఆరు మాత్రమే) 20-12-2024 నాటికి వడ్డీతో సహా
	క్రియేట్‌చేసిన ఇంట్రెస్ట్‌కు సంబంధించి సెక్యూర్డు అసెట్ వివరణ: పత్రం నెం.5332/2015 ఆధారంగా తేది.21.11.2015నాటి రిజిస్టర్డ్ పార్టిషన్ డీడ్ ప్రకారం "బి"మార్క్ షెడ్యూల్ ఆస్తి రుణ దరఖాస్తుదారుడి వాటాకు వచ్చును, దీనితో పాటు ఆమోదించబడిన ప్లాన్ మరియు పన్ను రసీదు పశ్చిమగోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, కొవ్వూరు సబ్-రిజిస్ట్రీలో, దేవరపల్లి పంచాయతీ, దేవరపల్లి గ్రామం, పాత 6వ వార్డు=ప్రస్తుత 10వ వార్డు స్థలం, పత్రంలో వివరించిన ప్రస్తుత కొలతల ప్రకారం, 591 చదరపు గజాలు, కానీ అది 578 చదరపు గజాలు అని తప్పుగా పేర్కొనబడింది, ప్రస్తుత కొలతల ప్రకారం స్థలం 591 చ.గ.లు, పాత టైల్డ్ ఇంటిని కలిగి ఉన్న డోర్ నెం.10-213 ను పూర్తిగా తొలగించారు మరియు ప్రస్తుతం ఖాళీ స్థలం ఉంది, దాని మధ్య స్థలంలో 207 చ.గ.లు ఆర్ఎస్ నెం.843/2బి దిగువ సరిహద్దులలోపు: తూర్పు: "ఏ" గా మార్క్‌చేసిన షెడ్యూల్‌లోని ఐటెమ్ నెం.2 యొక్క స్థలం -53.6 అ.ల ఆస్తి కొంతవరకు కె.రామ బ్రహ్మం వాటాకు వచ్చింది మరియు "బి"గా మార్క్‌చేసిన షెడ్యూల్ ఆస్తిలోని ఐటెమ్ నెం.2 యొక్క స్థలం వాటా కె.గంగ రాజు అలియాస్ రాజా (రుణ దరఖాస్తుదారు)కు వస్తుంది, దక్షిణం: ఉప్పలపాటి రామారావు ఇల్లు మరియు స్థలం-34.6 అ.లు, పడమర: "ఏ"మార్క్‌చేసిన షెడ్యూల్ ఆస్తిలోని ఐటెం నెం.1 స్థలం 1వ వాటాదారు కె. రామ బ్రహ్మం వాటాకు వస్తుంది -52.6 అ.లు, ఉత్తరం: పంచాయతీ రోడ్డు-36.0 అ.లు. పైన పేర్కొన్న సరిహద్దుల లోపల 207.1/2 చ.గ.లు = 173.496 చ.మీ.ల స్థలం, అన్ని సాధారణ మరియు సడలింపు హక్కులతో సహా. ఐటం నెం.2 పూర్తి విస్తీర్ణం 591 చ.గ.లలో ఈశాన్య మూల భాగం 103 3/4 చ.గ.ల విస్తీర్ణపు ఖాళీ స్థలం, దిగువ సరిహద్దులలోపు: తూర్పు: జిఎస్‌టి రోడ్డు-24.6 అ.లు, దక్షిణం: ఐటం నెం.2 యొక్క స్థలం "ఏ" మార్క్ చేయబడిన షెడ్యూల్ ఆస్తి 1వ వాటాదారు శ్రీ.రామ బ్రహ్మం వాటాకు వస్తుం-31.0 అ.లు, పడమర: ఐటం నెం.1యొక్క స్థలం "బి" మార్క్‌చేసిన షెడ్యూలులోని-25.0అ.ల ఆస్తి రుణ దరఖాస్తుదారు వాటాకు వస్తుంది, ఉత్తరం: పంచాయతీ రోడ్డు-44.6 అ.లు. పైన పేర్కొన్న సరిహద్దుల లోపల 103 3/ 4 చ.గ.లు = 86.748చ.మీ.ల ఉన్న స్థలం. రెండు ఐటంలు కలిపి 311 1/4 చ.గ.ల విస్తీర్ణపు స్థలంలో కలదు.		
2	1) శ్రీ సత్తి రాజు చీర్ల ...రుణగ్రహీత, 2) శ్రీమతి లక్ష్మి దుర్గ చీర్ల ... సహ-రుణగ్రహీత. **ఇరువురి నివాసం:** నివాసం: డి.నెం.5-20/1, పంచాయితీ వీధి, సీతానగరం మండలం, సీతానగరం, తూర్పుగోదావరి జిల్లా, సెమిఅర్బన్, రాజమండ్రి, ఆంధ్రప్రదేశ్, ఇండియా-533287. **Lan No: AP/RAJ/THRD/A000000226 &AP/RAJ/TUNI/A000000002**	05-12-2024	09-01-2025 & రూ.9,67,859/ - (రూపాయలు తొమ్మిది లక్షల అరవైఏడు వేల ఎనిమిదివందల యాభై తొమ్మిది మాత్రమే) 06-01-2025 నాటికి వడ్డీతో సహా
	క్రియేట్‌చేసిన ఇంట్రెస్ట్‌కు సంబంధించి సెక్యూర్డు అసెట్ వివరణ: పార్ట్ 1 ఆస్తి వివరణ: పత్రం నెం.824/2006 ఆధారంగా తేది.02.09.2006నాటి రిజిస్టర్డు సేల్ డీడ్ ప్రకారం ఆమోదించబడిన ప్లాన్ మరియు పన్ను రసీదుతో పాటు తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం సబ్-రిజిస్ట్రీ, సీతానగరం మండలం, సీతానగరం గ్రామపంచాయతీ మరియు గ్రామం, ఆర్ఎస్ నెం.74/5, విస్తీర్ణం ఎక 0.31 సెంట్లు, ఈశాన్య మూలలో, 5వ వార్డు, డోర్ నెం.7-124 కలిగిన ఆర్‌సిసి బిల్డింగ్, 194 చ.గ.ల విస్తీర్ణంలో ఈ క్రింది సరిహద్దులలో: తూర్పు: గంటా సూర్యరావు మరియు ఇతరులకు చెందిన ఇల్లు మరియు స్థలం 34.3 అ.లు, పడమర: చింతపల్లి వరలక్ష్మికి అమ్మిన స్థలం-34.3అ.లు, దక్షిణం: 9.0 అజల వెడల్పు మార్గం 51.0అ.లు, ఉత్తరం: రామచంద్రరావు కాంపౌండ్ వాల్-51.0 అ.లు. పైన పేర్కొన్న సరిహద్దుల స్థలంలో 194 చ.గ.లు = 162.184 చ.మీ.ల ఆర్‌సిసి బిల్డింగ్‌తో పాటు అన్ని సాధారణ మరియు ఈజ్‌మెంటరీ హక్కులు మొదలైనవి.		
3	1) శ్రీ తుమ్మూరి నరసింహమూర్తి ...రుణగ్రహీత, 2) శ్రీమతి తుమ్మూరి జ్యోతి ....సహ-రుణగ్రహీత, 3) శ్రీ తుమ్మూరి వెంకటేసులు ...2వ సహ-రుణగ్రహీత. **అందరి నివాసం:** నివాసం: ఇ.నెం.9-79, సంత మార్కెట్, ఖండవల్లి, పెరవల్లి మండలం, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, అం.ప్ర-534330. **Lan No: AP-RAJ-THRD-A000000483 & AP-RAJ-THRD-A000000723.**	05-12-2024	09-01-2025 & రూ.8,26,698/- (రూపాయలు ఎనిమిది లక్షల ఇరవై ఆరు వేల ఆరు వందల తొంభై-ఎనిమిది మాత్రమే) 06-01-2025 నాటికి వడ్డీతో సహా
	క్రియేట్‌చేసిన ఇంట్రెస్ట్‌కు సంబంధించి సెక్యూర్డు అసెట్ వివరణ: ఖండవల్లి గ్రామ మేజర్ పంచాయతీ, పెరవలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఎస్ఆర్ఓ సజ్జాపురం పరిధిలోని పాత ఆర్.ఎస్.నెం.86/1, న్యూ సర్వే నెం.86/1ఏ లోని పాత డోర్ నెం.9-129, న్యూ డోర్ నెం.9-79 కలిగిన స్థలం యొక్క ప్లాట్ నెం.20లోని 170 చ.గ.ల విస్తీర్ణంలో నిర్మించిన (రెండు పోర్షన్లు కలిగిన) గ్రౌండ్ ఫ్లోర్‌తో ఆర్‌సిసి బిల్డింగ్ మరియు స్థలం మొత్తం భాగం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులు: సరిహద్దులు: తూర్పు: పి. సూర్య ఎంకట శేషయ్యకు చెందిన ప్లాట్ నెం.6, దక్షిణం: పంట బోధి, పడమర: రోడ్డు, ఉత్తరం: తుమ్మూరి శ్రీనుకు చెందిన ప్లాట్ నెం.19.		

పై పేర్కొన్న రుణగ్రహీతలను సెక్షన్ 13(2) క్రింద నోటీసు జారీ తేది నుండి 60రోజుల్లోపు బాకీపడిన మొత్తాలను చెల్లించమని కోరుతున్నారు, విఫలం చెందితే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 నియమాల ప్రకారం పై పేర్కొన్న తేదిన సెక్షన్ 13(2) క్రింద నోటీసు జారీ తేది నుండి 60 రోజుల గడువు ముగిసిన తరువాత తదుపరి చర్యలు చేపట్టబడును.

తేది: 30-01-2025, ప్రదేశం: పశ్చిమ గోదావరి — **సం/- అధీకృత అధికారి, హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

తణుకు పురపాలక సంఘం

టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.1684/24/2025/E1 తేది : 29-01-2025

తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెలిపిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

			ఇ.సి.వి. (రూ.లక్షలలో)
1.	వాటర్ సప్లయి పనులు	7 నెం.లు	32.15
2.	శానిటేషన్ సంబంధిత పనులు	2 నెం.	30.68

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్‌సైటు నందు **ది.01-02-2025**వ తేదీ నుండి చూడవచ్చును.

కమిషనరు, తణుకు పురపాలక సంఘం

NUZVID MUNICIPALITY

'e' Procurement 2nd Call Tender Notice

Roc No: 1260/2024-E1 Dt: 29-01-2025

Sl.No	Name of Work	ECV Rs. in Lakhs
1	General Funds- 11 Works	Rs. 51.76 Lakhs

Contact : Commissioner, Nuzvid Municipality

Further details can be seen @ 'e' procurement Market Place @ "www.eprocurement.gov.in"

Download of Bid Document Starts from 25-01-2025 @ 10.00 A.M.

Last Date / Time for Receipt of tenders 10-02-2025 upto 2.30 P.M.

Sd/- Commissioner, Nuzvid Municipality

విద్యార్థుల పరిశ్రమల సందర్శన

విశాలాంధ్ర – గండేపల్లి : గండేపల్లి మండలం, సూరంపాలెంలో ఉన్న ఆదిత్య ఫార్మసీ కాలేజీ విద్యార్థుల పాఠ్యక్రమంలో భాగంగా హెటిరో ల్యాబ్స్, నక్కపల్లి పరిశ్రమను సందర్శించినట్లు ప్రిన్సిపాల్ డా డి సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 మంది విద్యార్థులు ఈ సందర్శనలో పాల్గొన్నారన్నారు. పరిశ్రమలో జరిగే వివిధ ప్రక్రియల గురించి విస్తృతమైన అవగాహన పొందినట్లు తెలిపారు. ఈ ప్రాక్టికల్ అనుభవం ఫార్మాస్యూటికల్ తయారీపై అవగాహనను కల్పించినట్లు వివరించారు. హెటిరో ల్యాబ్స్ అధికారులు సక్రియ ఔషధ పదార్థాలు (API) ఉత్పత్తి, నాణ్యత నియంత్రణ చర్యలు, గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్ (GMP) అనుసరణ యొక్క ప్రాముఖ్యత గురించి విలువైన సూచనలు అందించారు. కాలేజీ యాజమాన్యం తరఫున ముంటా దుర్గ శ్రీనివాస్ (హెచ్ఆర్), హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ – యూనిట్ III టివి సూర్య ప్రకాష్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్, జిల్లా ఇండస్ట్రియల్ సెంటర్, రాజమండ్రికు ఈ విలువైన అనుభవాన్ని ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి అరెస్టుకు చర్యలు : ఎస్సై

విశాలాంధ్ర – పెద్దాపురం : మైనర్ బాలికను మోసగించి వ్యక్తిని, అతని తల్లిని తక్షణమే అరెస్ట్ చేసేందుకు చర్యలు చేపడతామని పెద్దాపురం ఎస్ఎస్ఐ మౌనిక తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అనకాపల్లి చెందిన (17) మైనర్ బాలికను స్థానిక ఎన్ఆర్టీ కాలనీకి చెందిన చందు అనే వ్యక్తి ప్రేమ వలలో మోసం చేసి, వివాహం చేసుకున్నాడు. తన తరువాత తల్లి నీలిమ బాలికను వ్యభిచారం చెయ్యాలని ఒత్తిడితో పాటు రకరకాల మందులను వాడించడంతో బాలిక చివరకు మతిస్థిమితిలేని విధంగా తయారైం దన్నారు. ప్రస్తుతం విశాఖపట్నం ఆసుపత్రిలో అచేతనంగా ఉందని, అందిన సమాచారం మేరకు ఇరువురుని త్వర లోనే అదుపులోకి తీసుకుంటామని, కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతుందని ఎస్ఐ మౌనిక తెలిపారు.

బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర –రాజమహేంద్రవరం రూరల్ : పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో 2వ సంవత్సరంలో చేరుటకు SBTET నిర్వహించే ప్రవేశ అర్హత కొరకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటిఐలో బ్రిడ్జి కోర్సు నిర్వహించబడునని జిల్లా ఐటిఐల కన్వీనరు, ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ క్రిష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐలో రెండు సంవత్సరములు కోర్సును ఏదైనా చదివి ఉత్తీర్ణులైన వారిని ప్రామాణికంగా తీసుకొనబడునన్నారు. ఈ కోర్సులో అభ్యర్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ మ్యాథమెటిక్స్, సంబంధిత ల్యాబ్ ప్రాక్టికల్లో జనవరి 22 నుంచి 21 ఫిబ్రవరి వరకు రాజ మహేంద్రవరం ప్రభుత్వ ఐటిఐలో ఉచితంగా శిక్షణ యిస్తున్నారు. తదుపరి బ్రిడ్జి కోర్సు ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 25, 26న నిర్వహిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ యొక్క అన్నీ సర్టిఫికెట్స్ జెరాక్స్ కాపీలతో పాటు, ఆధార్, పాస్‌పోర్ట్ ఫోటోతో వెంటనే తమ కార్యాలయంలో సంప్రదించవలెనని తూర్పు గోదావరి జిల్లా ఐటిఐల కన్వీనరు, ప్రిన్సిపాల్ శఎల్ఆర్ఆర్ క్రిష్ణన్ తెలిపారు.

కుంభమేళా తొక్కిసలాట బాధాకరం

విశాలాంధ్ర – అమలాపురం : ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళాలో చోటుచేసుకున్న తొక్కిసలాటపై జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ బీజేపీ నాయకులు యాళ్ల వెంకట రామ మోహనరావు (దొరబాబు) దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భక్తులు చనిపోయారని తెలిసి ఆవేదనకు లోనయ్యాను. మన తెలుగు రాష్ట్రాల నుంచి మహా కుంభమేళాకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు పాటిస్తూ, ప్రభుత్వ అధికారుల సూచనలు అనుసరించ చాలని విజ్ఞప్తి చేస్తున్నానని అని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ బీజేపీ నాయకులు యాళ్ల దొరబాబు అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట

విశాలాంధ్ర – కాకినాడ : ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ..కాకినాడ నగరపాలక కమిషనర్ భావన ఐఏఎస్ బుధవారం తెల్లవారుజాము నుంచి అనేక ప్రాంతాల్లో పర్యటించారు. దీనిలో భాగంగా నగరంలోని అశోక్ నగర్, మధురానగర్, కరణంగారి సెంటర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. తడి, పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. చెత్త, మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కెటి సుధాకర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

జగన్ లక్షల కోట్లు దోచేసాడు : ఆదిరెడ్డి

విశాలాంధ్ర – రాజమండ్రి సిటీ : గత ఐదేళ్ల పాలనలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి ఎనిమిది లక్షల కోట్ల రూపాయిలు దోచేసాడని తెలుగు దేశం పార్టీ రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు విమర్శించారు. స్థానిక ఆనందరీజెన్సీలో సిటీ టీడీపీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆదిరెడ్డి మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని దోచేసాడని విమర్శించారు. రాష్ట్ర ఖజానా ఖాళీ చేసిన జగన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలు ఇంటికి పరిమితం చేసారన్నారు. లక్షల కోట్లు దోచేసిన జగన్ సిగ్గులేకుండా చంద్రబాబుపై, కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజల ప్రయోజనార్థం కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనుందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన అన్యాయాలు, అక్రమాలు ఒకొక్కటిగా బయటకు వస్తున్నాయన్నారు. టీడీపీ పార్టీలోని కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు.ఈసమావేశంలో మాజీ ఎంఎల్సి ఆదిరెడ్డి అప్పారావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆర్యాపురం కోపరేటీవ్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరావు, నాయకులు కాశీ నవీన్ కుమార్, నక్కా చిట్టిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ఆత్మగౌరవ సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర – అమలాపురం : భవన నిర్మాణ కార్మికుల ఆత్మగౌరవ సభ ఆదివారం రామచంద్రాపురంలో జరుగుతుందని సభకు విశాఖ జిల్లా ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు తాపీ మేస్త్రి, వడ్రంగి మేస్త్రిలు, రాడ్ బెండింగ్ ఐరన్, కాంక్రీట్ సెంట్రింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రిషన్ ఇలా 32 రకాల భవన నిర్మాణ కార్మికులు ఆత్మగౌరవ సభ విజయవంతం చేయాలని రాష్ట్ర కార్పెంటర్ ఉపాధ్యక్షుడు వీరవల్లి చినబాబు మాట్లాడుతూ ప్రస్తుతం మన కష్టాలు, ఇబ్బందులు ప్రభుత్వానికి విన్నవించే ఆలోచనతో భవన నిర్మాణ కార్మికుల చట్టం పునర్వం వ్యవస్థీకరణ చేయాలని నినాదంతో ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు ఈ సభకు విచ్చేసి మన ఆత్మ గౌరవాన్ని కాపాడుకుందామన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల భవన నిర్మాణ కార్మికులు అందరూ తరలిరా వాలన్నారు. ఈ సభకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విచ్చేయుచున్నారన్నారు. కార్యక్ర మంలో శ్రీకళా కార్పెంటర్స్ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు భీమేశ్వర తాపీ పనివాళ్ల సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు శ్రీ భీమేశ్వర ఎలక్ట్రిషియన్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిత్య శ్రామికులు జర్నలిస్టులు :సూరిబాబు

విశాలాంధ్ర – పిఠాపురం : జర్నలిస్టులు శ్రామికులని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు అన్నారు. భారతీయ వార్తా పత్రిక దినోత్సవం సందర్భంగా ఆయన పిఠాపురం పాత్రికేయులకు పత్రిక దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయుల పాత్ర చాలా కీలకమని, కత్తి మీద సాము లాంటి వృత్తిని కొనసాగిస్తూ నిత్యం సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు ప్రజలకు, ప్రభుత్వాలకు తెలియజేస్తూ నిరంతరం పోరాటం చేస్తారన్నారు. సమాజంలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక తదితర అన్ని వర్గాల అంశాలను నిష్పక్షపాతంగా సమన్వయం చేస్తూ మంచి, చెడులను ఎత్తి చూపి ఏ స్వార్థం లేకుండా సమాజ శ్రేయస్సు కోరుకునే పాత్రికేయులు ప్రజలకు చేరవేసేందుకు నిరంతరం కృషి చేస్తారని, అటువంటి పాత్రికేయులను గౌరవించుకోవడం మన ధర్మమన్నారు.

సంగమేశ్వరుని దర్శించుకున్న సందీప్



విశాలాంధ్ర – కరప : కరప మండలం ఉప్పలంక గ్రామం శివారు మొండి నందు బుధవారం జరిగిన చొల్లంగి తీర్థంలో అశేష భక్తజనం స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకున్నారని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఉదయం నుండి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశామన్నారు. ఇన్చార్జ్ ఈవోలుగా మురళి వీరభద్రరావు, వేణ, సుబ్రహ్మణ్యం, శివకుమార్, పరిశీలించారు. కాకినాడ రూరల్ శాసనసభ్యులు తనయుడు పంతం సందీప్ సంగమేశ్వర స్వామిని దర్శించుకుని వేద పండితుల ఆశీర్వచనాలు పొందారు. జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, పండు, తదితర నాయకులు పాల్గొని పర్యవేక్షణ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు దగ్గరుండి చూసుకున్నారు. వేలాది భక్తుల మధ్య సంగమేశ్వర స్వామి తీర్థం కనులు పండగగా జరిగిందన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

విశాలాంధ్ర – అమలాపురం : ఏపీ రోడ్డు భద్రతావారోత్సవాల్లో భాగంగా బుధవారం అమలాపురంలో కిమ్స్‌కి ఎదురుగా రోడ్డుపై ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ గురించి రోడ్ ప్రమాదాలు గురించి అవగాహన కల్పించారు. ఏపీ రోడ్ సేఫ్టీ ఎన్జీఓ తూర్పు గోదావరి జిల్లా చైర్మన్ అరిగేల వెంకట రామారావు, సభ్యులు కలిసి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాహనాలు ఎలా నడపాలి, ప్రమాదాలు ఎలా జరుగు తాయి, మెలుకువలు, జాగ్రత్తలు డ్రైవర్లకు నేర్పించారు.

ఘనంగా సంవిధాన్ గౌరవ అభియాన్

విశాలాంధ్ర – ఆత్రేయపురం : మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రం ఆత్రేయపురం గ్రామంలో బుధవారం మండల అధ్యక్షులు ఉమ్మిడిశెట్టి వెంకటేశ్వరావు అధ్యక్షతన భారత రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా భారత్ సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్దపేటలో భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ రచించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాజ్యాంగ దివాస్ కార్యక్రమం దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ చేపట్టిందన్నారు. అనంతరం బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితంలో ముఖ్య ప్రదేశాలను భారతీయ జనతా పార్టీ గుర్తించి, పంచ తీర్థ్ అని 1.జన్మభూమి, 2.శిక్షాభూమి, 3 దీక్షభూమి, 4. మహాపరినిర్వాన్ సతల్, 5. చైత్య భూమిని అభివృధి చేసి, పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దారన్నారు.మండల ప్రతినిధి అల్లు భాస్కర్ రావు, రాష్ట్ర కిసాన్ మోర్చ జోనల్ ఇంచార్జ్ చేకూరి రమేష్ వర్మ, వాడపల్లి బూత్ అధ్యక్షుడు పడాల నాగేశ్వరరావు, ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుడవెల్లి రాంబాబు, అల్లు రామకృష్ణ, వారా ప్రకాష్ రావు, గొల్లపల్లి సోమరాజు, అభిరామ్ పాల్గొన్నారు.

పీఎంపీఎస్‌పై శిక్షణ

విశాలాంధ్ర – అమలాపురం : జన కళ్యాణ్ ప్రివెన్షన్ యూనిట్ కార్యాలయంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ యూనిట్ పర్యవేక్షణలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భరత్ లక్ష్మి ఆదేశాలతో, జనకళ్యాణ్ అమలా పురం సిబ్బందితో శిక్షణ కార్యక్రమం బుధ వారం నిర్వహించారు. స్థానిక అమలాపురం కార్యాలయంలో ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ ఐసీటీసీ సూపర్‌వైజర్ ఏ బుజ్జిబాబు, రత్నరాజు హాజరయ్యారు. పీఎంపీ ఎస్ఈ ప్రాముఖ్యత గురించి సిబ్బం దికి శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా జనకళ్యాణ్ ప్రాజెక్ట్ మేనేజర్ జి శ్రీను, యుఈటీవిస్ ప్రాజెక్ట్ మేనేజర్ టి రాజ, పిఎంపిఎస్ ఈ చెయ్యడం ద్వారా దాగి ఉన్న కొత్త కమ్యూనిటీ గుర్తించి, వారి మెరుగైన సేవలు అందించడం ద్వారా 2030 నాటికి జీరో న్యూ ఇన్ఫెక్షన్స్ అనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. పిఈ. ఎస్ఓఆర్ డబ్బులు, జన కళ్యాణ్ సిబ్బంది, ఏఎన్ఎం రమణి పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో మండలం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలం అభివృద్ధి నిధులను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నుంచి అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వాటిని త్వరితగతిన మంజూరు అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. మండల అభివృద్ధి విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారించాలని అధికారులకు సత్యానందరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో లిఫ్ట్ ఇరిగేషన్ సమస్య పరిష్కారం

విశాలాంధ్ర - కాకినాడ : కరప మండలం గొర్రిపూడి గ్రామంలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్‌ను దుండగులు దొంగలించడం వలన గొర్రిపూడి, వేమవరం, పొల్లంగి, గురజానపల్లి గ్రామాలకు చెందిన సుమారు 4800 ఎకరాల ఆయకట్టుకు లిఫ్ట్ ఇరిగేషన్ పనిచేయకపోవడంతో పొలాలకు నీరు అందక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఘటనపై కూటమి నాయకులు, రైతులు కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీకి దృష్టికి తీసుకుని వెళ్లగా వెంటనే నాయకులను, రైతులను తన వెంట తీసుకుని కాకినాడ జిల్లా కలెక్టర్‌ని కలిసి సమస్య తెలిపారు. కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులను పంపించి సమస్యను పరిష్కారములో భాగంగా కొత్త ట్రాన్స్ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. రైతుల పొలాలకు సాగునీరు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అందేలా చర్యలు చేపట్టారు. సమస్యను వెంటనే పరిష్కారించి నందుకు ఎమ్మెల్యే పంతం నానాజీకి, జిల్లా కలెక్టర్ వారికీ రైతులు, స్థానిక నాయకులు ధన్యవాదములు తెలియచేసి, హర్షం వ్యక్తం చేసారు.

వరిలో సల్ఫయిడ్ ఇంజురీ నివారణకు చర్యలు

విశాలాంధ్ర - కడియం : ప్రస్తుతం రబీ పంటకు తూర్పు గోదావరి జిల్లాలో రైతులు ముమ్మరంగా వరి నాట్లు వేసుకొన్నారని, ఎరువుల వేత కొనసాగుతుందని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్ర వేత్త, డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. కడియం ఆవ ప్రాంతంలో వరిపొలాలను వ్యవసాయ అధికారులు, స్థానిక రైతులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. వరిలో సల్ఫయిడ్ దుష్ప్రభావం కనిపించింది, మొక్కల ఎదుగుదల లోపిం చడంతో చేపట్టవలసిన నీటి, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సల్ఫయిడ్ ఇంజురీ అనేది వరిలో మురుగు నీరు బయటకు పోయే సౌకర్యం లేని పొలాల్లోను, సల్ఫర్ కలిగిన ఎరువులు, ముఖ్యంగా కాంప్లెక్స్ ఎరువు వాడిన పొలాల్లో కనిపిస్తుందని తెలిపారు. దీనివల్ల వేరు, ఆపైన కొంత కాండ భాగం నల్లగా మారుతుందనీ, పొలంలో నడుస్తుంటే బుడగలు వస్తుంటాయని, వేరు భాగం వద్ద సల్ఫరు చెడు వాసన వస్తుందని తెలిపారు. వరి చేలో నీటిని అడపాదడపా ఆరబెట్టడం, మరల స్వచ్ఛమైన నీటిని పెట్టడం చేయాలన్నారు. అనంతరం ఎలుకల నిర్మూలన కార్యక్ర మంలో భాగంగా, రైతులకు ఎలుకల మందు పొట్లాల పంపిణీ చేపట్టారు. ఈ క్షేత్ర సందర్శనలో జిల్లా వనరుల కేంద్రం ఏడిఏఎస్ జయరామలక్ష్మి, కడియం ఏఓ ద్వారకా దేవి, ఉద్యానవన అధికారి సుధీర్ కుమార్, వీఏఏ శంకర్, దుర్గబాబు, అభ్యుదయ రైతులు సత్తిరాజు, మారిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమాజ సేవే పరమావధి : శ్రీనివాస్‌గుప్తా

విశాలాంధ్ర-కొవ్వూరు : సమాజ సేవ యే పరమావధిగా వాసవి క్లబ్ పనిచేస్తుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ దర్శి శ్రీనివాస్ గుప్త అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కొవ్వూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని మంగళవారం కొవ్వూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపం నందు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొవ్వూరు వాసవి క్లబ్ అధ్యక్షుడిగా మన్యం వీరభద్ర గుప్త, కార్యదర్శిగా సత్యవరపు గురునాథ్, కోశాధికారిగా సత్యవరపు భరత్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా దేవత కృష్ణ ప్రసాద్‌చే వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ చలగంట్ల ఎన్ వివిఎస్ఎస్ ప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. వాసవి క్లబ్ నూతన అధ్యక్షులు మన్యం వీరభద్ర గుప్త మాట్లాడుతూ సమాజంలో అవసరతలను గుర్తించి సహాయ సహకారాలు అందించడంలో నిరంతరం కృషి చేస్తానని, సేవయే పరమావధిగా పనిచేస్తూ క్లబ్ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వలివేటి ఎల్ ఎన్ వి ప్రసాద్, క్యాబినెట్ సెక్రెటరీ ఎన్ వి చలపతిరావు, క్యాబినెట్ ట్రెజరర్ చల్లగంట్ల వెంకటేశ్వరరావు, వయసు గవర్నర్ కేదార శెట్టి రవికుమార్, డిస్టిక్ ఇన్చార్జి గ్రంధి గంగాధర ప్రవీణ్, రీజియన్ చైర్మన్ ఆలపాటి అచ్యుత లక్ష్మి, జోన్ చైర్మన్ కాకి అనిల్ సూర్య, కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మద్దుల వీర వెంకట సత్యనారాయణ, అధ్యక్షులు మట్టే వీర వెంకట ప్రసాద్, కార్యదర్శి కొల్లేపర శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - గండేపల్లి : మహిళల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెద్దాపురం 7వ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి జస్టిస్ జి చాముండేశ్వరి అన్నారు. బుధవారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును గండేపల్లి మండలంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా చాముండేశ్వరి హాజరయ్యారు. ఆర్థిక స్థోమత లేకపోవడం న్యాయం పొందడానికి ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో ప్రతీ ఒక్కరికీ న్యాయస్థానాలలో న్యాయం జరగాలని ఉచిత న్యాయ సేవా సంస్థలు ఏర్పాటు చేశారనీ, వారసత్వ ఆస్తులు కొనుగోలు చేసినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ, ఆస్తి మార్పిడి పత్రాలు క్రమపద్ధతిలో ఆన్‌లైన్ చేసుకుంటే కోర్టుల్లో సివిల్ తగాదాలు సులభంగా పరిష్కారం అవుతాయన్నారు. న్యాయ వాదులు ఎ ప్రభుజీ, ఎం రాంబాబు, ఎస్ దుర్గారావు, ఎస్ విశాలాక్షి బాల్య వివాహాల నిషేధ చట్టం, వరకట్న నిరోధక చట్టం, లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర పరిష్కారం, లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం గురించి వివరించారు. ఎంపీడీఓ నాతి బుజ్జి, సీడీపీఓ పూర్ణిమ, సర్కిల్ ఇన్స్పెక్టర్ వైఆర్కే శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్‌లు మహిళల భద్రత, సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పి ఏపీఎం సన్యాసి రావు, మండల సమాఖ్య, గ్రామ సమాఖ్యల నాయకురాళ్లు, మహిళలు పాల్గొన్నారు.

విద్యానిధి నాయుడుకు సత్కారం

విశాలాంధ్ర - అమలాపురం : నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ డిగ్రీ కళాశాల యాజమాన్యాల ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆకుల బాపన్న నాయుడును ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ అన్ ఎయిడెడ్ మేనేజ్మెంట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. ప్రయివేట్ విద్యాసంస్థల సమస్యలను ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసి, పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు దొడ్డా సత్తిబాబు, జిల్లా అధ్యక్షులు ఎస్‌వి రమణారావు, కార్యదర్శి టిఎస్ఆర్ అయ్యప్పనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ గోపీనాథ్, డివిజన్ అధ్యక్షుడు రత్నం రాజు, నాయకులు కడలి సుబ్రహ్మణ్యం, గోపాలకృష్ణ తదితరులు నాయుడును అభినందించారు.

31న వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

విశాలాంధ్ర - జగ్గంపేట : ఈ నెల 31న ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ ఆలయంలో నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆత్మార్పణ దినోత్సవం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీవో నెంబర్ 181 విడుదల చేసిందన్నారు. ఆర్యవైశ్యులను కూటమి ప్రభుత్వం గుర్తించింది అనడానికి ఇదే నిదర్శనం అన్నారు. ఆర్య వైశ్యులను గుర్తించి నందుకు సిఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు, జ్యోతుల నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్‌లా చంద్రబాబు కాలయాపన చేయలేదు : అప్పలరాజు

విశాలాంధ్ర - జగ్గంపేట : జగన్‌లా సిఎం చంద్రబాబు కాలయాపన చేయలేదని అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచారని, సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఉచిత గ్యాస్ అమలు చేశారని ఇవన్నీ మీకు కనపడటం లేదా అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ ఎస్ అప్పలరాజు వైసీపీ నాయకులను ప్రశ్నించారు. నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఆయన బుధవారం పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. వైసిపి నేత ఒమ్మి రఘురామ్ మంగళవారం చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. సిఎం చంద్రబాబుకు ప్రజలను నమ్మించి మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని రఘురామ్ అన్నారని, అది మీ నాయకుడు జగన్‌కే దక్కుతుందన్నారు. గెలిచిన వెంటనే వృద్ధులకు వెయ్యి రూపాయలు, వికలాంగులకు 3 వేలు పెంచారన్నారు. ఉగాది నుండి మహిళలకు ఉచిత బస్సు అమలు చేయనున్నారన్నారు. మచ్చలేని వ్యక్తి చంద్రబాబు అని, అటువంటి వ్యక్తిని విమర్శించే స్థాయి మీకు లేదంటూ రఘురామ్ పై ఆయన మండిపడ్డారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింటు అయిన పూర్వం తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కరప మండలం, గొర్రిపూడి గ్రామం, మూరుకోపర, డోర్ నెం. 5-127 రు కాపురస్తులు, ఖండవల్లి వెంకట రమణ గారి భార్య శ్రీమతి ఖండవల్లి పాప గారు మాకు ఇచ్చిన సంజాయిషీ పై యావన్మందికి తెలియజేయునది ఏమనగా. మా క్లయింటు The Kakinada Co-Operative Town Bank Limited, కాకినాడ వారి వద్దకు వారి ఆస్థిని అనగా పూర్వం తూర్పుగోదావరి జిల్లా, కరప మండలం, గొర్రిపూడి గ్రామ పంచాయతీ ఏరియలోని గొర్రిపూడి గ్రామం, తాలూకు సర్వే నెం. 373-5, రివిజన్ సర్వే నెం. 373.6 గల య. 0.08 ట్లు లేక 387.2 చ.గల స్థలమును కొదువ పెట్టి రిజిస్టర్ తనఖా చేసి అప్పు పొందే నిమిత్తం వెళ్ళగా సదరు బ్యాంక్ వారు మా క్లయింటు సెటిల్మెంట్ దస్తావేజుకు లింకు దస్తావేజు అయిన సెటిల్మెంట్ దస్తావేజు ది. 24-04-1993 Vide Doc No. 1132/1993 అడిగినారు. సదరు ఒరిజినల్ లింకు దస్తావేజును చదలు పట్టి పోవడం వల్ల మా క్లయింటు బ్యాంక్ వారికి సమర్పించలేకపోయినారు కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా మా క్లయింటు బ్యాంక్ నుండి లోన్ పొందుటకు గాని వారి ఒరిజినల్ లింకు దస్తావేజు విషయం లో కానీ ఎవరికైనాను ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల ఈ దినము నుండి 4 దినములలోగా పైన ఉదహరించిన మా క్లయింటు అడ్రస్ కు లేక మాకు కానీ తెలియపరచవలెను.

వక్కలంక సత్యనారాయణమూర్తి
P(V). వాణిశ్రీ, M(T). రాజశ్రీ, T.S.RATNAKAR
అడ్వకేట్స్, డో.నెం.7-9-29,
కాకినాడ. సాంబమూర్తి వీధి, రామారావుపేట.
ది.28-01-2025 కాకినాడ. సెల్: 98490 12112

ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : ప్రయాణ సమయంలో వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని పెద్దాపురం డీటీఓ శివారెడ్డి అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం మెటార్ వెహికల్ ర్యాలీని జిల్లా రవాణా శాఖాధికారి శివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీటీఓ శివారెడ్డి మాట్లాడుతూ ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతీ ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రాణ రక్షణకై విధిగా ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మౌనిక, ఏఎంవీఐ గౌరీశంకర్, రవి, పోలీసులు పాల్గొన్నారు.

పెన్షన్ దారులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - సీతానగరం: బెడ్ రిడిన్ పెన్షన్ దారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం మండల వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బెడ్ రిడిన్ పెన్షన్ లబ్ధిదారుల పరిశీలన నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నియ మించిన రెండు వైద్య బృందాలు మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో 15 సచివలయాల పరిధిలో 34 మంది లబ్ధిదారులను వైద్యులు వారిఇంటి వద్దే వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షలు నివేదిక నేరుగా ప్రభు త్వానికి అందజేయనున్నారు. ఈ తనిఖీలో వైద్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ 4వ అదనపు

జిల్లా జడ్జి వారి కోర్టులో

ఇపి నెం.13/2022, ఓఎస్ నెం.57/2018

Between :
Yakkala Harish rep by its
GPA Holder Yakkala Prasada Rao - Dhr

And

1. Yaramati Ramish Giri (died)
2. Yaramati Lakshmi Kumari
W/o Venkata Giri Rao, Aged 70 Yrs
D. No. 1-14-11, Eswara Dharani Apts
Sri Ram Nagar Kakinada.
3. Yaramati Anuradha W/o Late Ramesh Giri Aged 42 Yrs, D. No. 1-14-11, Eswara Dharani Apts, Sri Ram Nagar Kakinada.
4. Yaramati Asyaswanth S/o Late Ramesh Giri Aged 15 Yrs, D. No. 1-14-11, Eswara Dharani Apts, Sri Ram Nagar Kakinada.
5. Yaramati Siri D/o Late Ramesh Giri Aged 12 Yrs, D. No. 1-14-11, Eswara Dharani Apts, Sri Ram Nagar Kakinada.
(Respondent 4 & 5 beving ninors Rep/Mother 3rd Respondent) **--- Jdrs**

సదరు పై నెంబర్ అమలు గ్రంథమున శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినప్పటికీ ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **ది.6-2-2025 సం॥తేదీ ఉదయం 10.30** ని॥లకు మహారాజశ్రీ పైన ఉదహరించిన కోర్టు వారు ఎదుట హాజరు కావలెను. లేని ఎడల నీ పరోక్షమున తీర్మానించబడును.

ఎన్.ఎస్.ఆర్.ఎన్.చౌదరి, ఎంఎబిఎల్
అడ్వకేట్
డోర్.నెం.10-7-34, దమ్యంరాజు
అపార్ట్‌మెంట్, రామారావుపేట, కాకినాడ.
సెల్ నెం.9848222565
కాకినాడ, తేదీ : 25-1-2025

కలెక్టర్ ఈవీఎం గోడౌన్ తనిఖీ

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం : కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం ఈవీఎం గోడౌన్ తనిఖీ చేయడం జరిగిందని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. స్థానిక ఎఫ్ సీఐ గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎం కేంద్రాన్ని ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్ తో కలిసి కలెక్టర్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి ఈవీఎం భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వివరాలను, సీసీటీవీ ఫుటేజ్ ను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీస్ భద్రత సెక్యూరిటీ షిఫ్ట్ వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్ వెంట రాజకీయనాయకుల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పాత్రికేయుడు సలీం మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - సామర్లకోట : భీమేశ్వరాలయం కొత్త వంతెన పైనుంచి గోదావరి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన పెదపూడి మండలానికి చెందిన పాత్రికేయుడు షేక్ సలీం మృతదేహం బుధవారం లభ్యమైంది. సామర్లకోట-కాకినాడ రోడ్డులోని గోదావరి కాలువలో లాకులు దాటిన తరువాత గుర్రపు డెక్క మధ్యలో నీటిలో మృతదేహం తేలియాడి ఉండటాన్ని పోలీసులు కనుగొన్నారు. దీంతో మృతదేహాన్ని బయటకు తీసి సలీం భార్య, కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు మృతదేహం సలీందే నని నిర్ధారించారు. ఈనెల 9 సాయంత్రం రాత్రి 7 గంటల ప్రాంతంలో స్థానిక రైల్వే గేట్ సమీపంలో ఉన్న భీమేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే వంతెన పైనుంచి గోదావరి కాలువల దూకి ఆత్మహత్యకు పాల్పడగా అతని కోసం పోలీసులు నిత్యం గాలింపు చర్యలు కొనసాగించారు. పెదపూడి గ్రామానికి చెందిన షేక్ సలీం పలు పత్రికలతో పాటు పలు మీడియా ఛానళ్లలో, జర్నలిస్ట్ యూనియన్ నాయకుడిగా పనిచేశారు. సలీం సామర్లకోట పట్టంలోని ఇస్మాయిల్ నగర్‌లో కొంతకాలం నివసించారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. గోదావరి కాలువలో 20 రోజులు పాటు మృతదేహం ఉండిపోవడంతో ముఖం పూర్తిగా పాడై గుర్తుపట్టనంతగా పాడవగా సలీం ధరించిన దుస్తులను బట్టి బంధువులు మృతదేహం సలీందిగా గుర్తించారు. మృతదేహం బాగా పాడవడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసి స్థానిక సిఐ కృష్ణ భగవాన్ ధర్యాప్తు చేస్తున్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని వాకపల్లి గ్రామానికి చెందిన ముడదా దేవుడు చేతికి ఆపరేషన్ చేయించుకున్న సందర్భంగా దేవుడుని పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని రూ.5000 వేలు ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు. ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో బర్ల గోవింద్, అవ్వా ఆదినారాయణ, మడబాల బాబ్జి, కిల్లాడి శివ, గొర్ల కుశరాజు, గొర్ల రామజినేయులు, కిల్లాడి దేవుడి, కిల్లాడి నూకరాజు, లోక సూర్య చంద్ర, కొప్పిశెట్టి వీరబాబు, నెలపర్తి రమణ, బొల్లం తాతారావు, పకుర్తి దొంగబాబు, గింజల ప్రసాద్, కోలా తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన

విశాలాంధ్ర - కాకినాడ : బుధవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ షణ్మోహన్, రెవెన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు, జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈవీఎం గోదాము భద్రతకు చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఈవీఎం, వీవీపాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎంల గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా కాకినాడ అర్బన్ తహసీల్దార్ వీ జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటి ఎం జగన్నాథం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి

విశాలాంధ్ర - కడియం : కుష్టు వ్యాధి గ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని తూర్పు గోదావరి జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ ఎన్ వసుంధర అన్నారు. కడియం మండలం మాధవరాయుడు పాలెం పంచాయతీ శివారు చైతన్య నగర్ సమీపంలో గల ఇమ్మానుయేల్ లెప్రసి కాలనీని బుధవారం ఆమె సందర్శించి లెప్రసి పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేసి, ప్రస్తుతం మందులు వాడుతున్న లెప్రసి రోగుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పక ఎండిటి మందులు వాడడం ద్వారా అంగ వైకల్యం రాకుండా నివారించచవచ్చని తెలియజేసారు.

muthoot HOUSING FINANCE

ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : టిసి సం.14/2074-7, ముత్తూట్ సెంటర్, పున్నెన్‌రోడ్, తిరువనంతపురం-695 034, సిఐఎన్ సం : యు65922కెఎల్2010పిఎల్‌సి025624
కార్పోరేట్ ఆఫీస్ : 12/ఎ 01, 13వ అంతస్తు, పరిణి క్రెసెంజో, ప్లాట్ నం.సి38 & సి39, బంద్రా కుర్లా కాంప్లెక్స్-జి బ్లాక్ (ఈస్ట్), ముంబై-400051, టెలి నం : 022-62728517,
బ్రాంచ్ చిరునామా: శ్రీనివాస్, డి.నం.57-2-15, కిలారువారి వీధి, పంటకాలువ రోడ్డు, పటమట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520010.
అధీకృత అధికారి: సంప్రదించు వ్యక్తి: ఓంకారేష్ జి, మొబైల్ సం.: 9902067892, Email Id: authorised.officer@muthoot.com

స్థిర ఆస్తుల విక్రయానికి ఇ-వేలం కొరకు బహిరంగ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 8(6)తో చదివే ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 కింద స్థిర ఆస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయ ప్రకటన.
రుణగ్రహీత(లు)/తనఖాదారు(లు) మరియు హామీదారు(లు) నుండి ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌కు రావల్సిన బకాయిలు ప్లస్ వడ్డీ తిరిగి పొందేందుకు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) కింద జారీ చేయబడిన డిమాండ్ నోటీసు (లు) ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి స్వాధీనంలోకి తీసుకోబడిన ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ కు తనఖా పెట్టిన/ఆధీనం చేసిన ఈ కింద పేర్కొన్న స్థిర ఆస్తులను "ఎచ్చట ఉన్నది అలాగే", "ఉన్నది ఉన్నట్లు", "అక్కడ ఉన్నది ఏమైనా" మరియు "రికోర్స్ లేని పద్ధతిలో" ఈ కింద పేర్కొన్న రుణఖాతాల్లోని ఆస్థి(లు)లు విక్రయించబడునని ప్రత్యేకించి రుణగ్రహీత(లు)/ తనఖాదారు(లు) మరియు హామీదారు(లు)లకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. విక్రయం వెబ్ పోర్టల్: https://sarfaesi.auctiontiger.net/EPROC/ పై ఇ-వేలం ద్వారా నిర్వహించబడును.

వ. నం.	రుణఖాతా సంఖ్య /రుణగ్రహీత(లు)/ సహ రుణగ్రహీత(లు)/హామీదారు(లు)/ తనఖాదారు(లు) పేరు	మొత్తం బకాయి (రూ.లు) & వర్తించే భవిష్యత్తు వడ్డీ	స్వాధీన టైప్& తేదీ	తనిఖీ తేదీ మరియు సమయం	రిజర్వు ధర (రూ.)	ధరావత్తు సొమ్ము డిపాజిట్ (ఇఎండి)	ఇ-వేలం తేదీ & సమయం	బిడ్ సమర్పణకు చివరి తేదీ
1.	MHFLCONRJM000005004993 1. బేడంపూడి చిన దిలీప్ కుమార్ 2. బేడంపూడి బాబూరావు 3. బేడంపూడి విజయ	06-జనవరి, 2025 నాటికి రూ.10,23,890/- (పదిలక్షల ఇరవైమూడు వేల ఎనిమిది వందల తొంభై రూపాయలు మాత్రమే)	లాంఛనప్రాయ స్వాధీనత తేదీ: ఆగస్టు 12, 2024	04/ఫిబ్రవరి/2025, ఉ.11.00 గం. నుండి మ.03.00 గం.లు	రూ. 17,00,000/- (పదిహేడు లక్షల రూపాయలు మాత్రమే)	రూ. 1,70,000/- (లక్షా డెబ్బై వేలరూపాయలు మాత్రమే)	05-మార్చి-2025 ఉ.11.00 గం. నుండి మ.12.00 గం.లు	04-మార్చి-2025 ఉ.10.00 గం. నుండి సా.5.00 గం.లు
	హామీగా పెట్టిన ఆస్తి(లు) వివరాలు : తూర్పు గోదావరి జిల్లా, కోరుకొండ మండలం, శ్రీ కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ ఏరియా , దోసకాయలపల్లి గ్రామ పంచాయతీ, దోసకాయలపల్లి రెవెన్యూ గ్రామం రివిజన్ సర్వే నెం. 371/1, 149.3 చదరపు గజాలు (లేదా 124.82 చదరపు మీటర్లు) ప్లాట్‌లో డి.నెం.6-220, ఆర్.సి.సి. పైకప్పు గల భవనం యొక్క ఆస్తి మొత్తంగా. ఆస్తి సరిహద్దులు: తూర్పు: 32 అడుగుల రోడ్డు, దక్షిణం: నందికోళ్ల అర్జయ్య భూమి 42 అడుగులు, పశ్చిమం: గుర్రాల స్వామి భూమి 32 అడుగులు, ఉత్తరం: ఐత్తిన వెంకటేష్ ఇంటి భూమి 42 అడుగులు.పై సరిహద్దుల మధ్య 149.3 చదరపు గజాల (లేదా 124.82 చదరపు మీటర్లు) విస్తీర్ణంలో ఉన్న బహిరంగ భూమి మరియు ఈ ఆస్తి మరియు దాని జలాల హక్కులు మీకు లభిస్తాయి.							

నియమ నిబంధనలు: 1)ఈ ఇ-వేలం సర్ఫేసీ చట్టం, 2002 క్రింద ఉన్న మార్గదర్శకాల ప్రకారం ఈ కింద పేర్కొన్న నిబంధనలు మరియు షరతులకు లోబడి మరియు ఉద్దేశించిన బిడ్డర్లు సమర్పించాల్సిన ఆఫర్/టెండర్ డాక్యుమెంట్‌లో పేర్కొన్న నిబంధనలు మరియు షరతులకు కచ్చితంగా లోబడి ఉంటుంది. 2) అమ్మకం **"ఎక్కడ ఉందో అలాగే" మరియు "ఉన్నది ఉన్నట్లుగా" "అక్కడ ఉన్నది ఏదైనా" మరియు "రికోర్స్ లేకుండా"** షరతులతో విక్రయించబడును. 3) ఆసక్తిగల బిడ్డర్లు ఇ-వేలం పోర్టల్ అనగా https://sarfaesi.auctiontiger.net/EPROC/ నందు లభ్యమయ్యే నిర్దిష్ట బిడ్/ఆఫర్/టెండరులో ఆఫర్/బిడ్‌ను తప్పనిసరిగా "ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్" పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో తీసిన ధరావత్తు సొమ్ము డిపాజిట్ ("ఇఎండి")తో పాటు సమర్పించవలెను. ఆసక్తిగల బిడ్డర్ బిడ్/టెండరు/ఆఫర్ డాక్యుమెంట్స్‌తో పాటు కేవైసీ డాక్యుమెంట్లు అనగా పాన్‌కార్డు నకలు, బిడ్డర్ ఐడెంటిటీ ధ్రువీకరణ పత్రం మరియు చిరునామా ధృవీకరణ, పాస్‌పోర్ట్ నకలు, ఎన్నికల కమిషన్ కార్డు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ మొదలైనవాటి నకలు కూడా జతచేయాలి. 4) ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారికి తెలిసినంత వరకు మరియు సమాచారం మేరకు, ఆస్తి(లు)కి సంబంధించి అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం వెల్లడించినవి తప్ప, ఎటువంటి రుణభారాలు/క్లెయిమ్‌లు లేవు. అయితే ఎంహెచ్‌ఎఫ్‌సిఎల్ చట్టబద్ధమైన బకాయిలు/రుణభారాలు/ మూడవ పక్షం క్లెయిమ్‌లు/హక్కులు/బకాయిలు/మునిసిపల్ పన్నులు, నిర్వహణ / సొసైటీ ఛార్జీలు, విద్యుత్ మరియు నీటి పన్నులు లేదా స్టాంప్ డ్యూటీ, జిఎస్‌టి, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, బదిలీ ఛార్జీలు మరియు పేర్కొన్న ఆస్తులకు సంబంధించి విక్రయ ధృవీకరణ పత్రం రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఏవైనా ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో సహా ఏవైనా ఇతర బకాయిలకు బాధ్యత వహించదు. విజయవంతమైన బిడ్డర్/కొనుగోలుదారు చెల్లించాలి. ఆసక్తిగల బిడ్డర్లు ఆసక్తిగల బిడ్డర్లు రుణభారాలు, ఆస్తి యొక్క టైటిల్ గురించి వారి స్వంత స్వతంత్ర విచారణలు చేసుకుని సంతృప్తి చెందాలి. 5) విజయవంతమైన బిడ్డర్/కొనుగోలుదారు తుది బిడ్ మొత్తంలో 25% (ఇప్పటికే చెల్లించిన 10శాతం ఇ.ఎం.డి సర్దుబాటు చేసిన తర్వాత) అధీకృత అధికారి బిడ్‌ను ఆమోదించిన తర్వాతి పని దినాలలోపు చెల్లించాలి. 6) అమ్మకపు ధరలో మిగిలిన 75% మొత్తాన్ని అధీకృత అధికారి విజయవంతమైన కొనుగోలుదారుకు అమ్మకం యొక్క ధృవీకరణను తెలియజేసిన 15 రోజులలోపు లేదా అధీకృత అధికారి రాతపూర్వకంగా మరియు పూర్తిగా వారి అభీష్టానుసారం అంగీకరించిన, పొడిగించిన వ్యవధిలోగా చెల్లించవలెను. విజయవంతమైన బిడ్డర్ చెల్లింపులో డిఫాల్ట్ అయితే, ఇప్పటికే డిపాజిట్ చేసిన మొత్తం జప్తు చేయబడుతుంది మరియు ఆస్తిని తిరిగి వేలానికి ఉంచబడుతుంది మరియు డిఫాల్ట్ చేసిన రుణగ్రహీతకు ఆస్తి మరియు మొత్తానికి సంబంధించి ఎటువంటి క్లెయిమ్ ఉండదు. 7) ఇఎండి డిపాజిట్ చేసిన ఆసక్తిగల బిడ్డర్ ఇ-వేలం పోర్టల్‌లోకి లాగిన్ అవ్వడంలో, బిడ్ సమర్పించడంలో, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొదలైన వాటిలో ఏదైనా సహాయం అవసరమైతే, పని దినాలలో కార్యాలయ వేళల్లో మా సర్వీస్ ప్రొవైడర్ **M/s e-Procurement Technologies Limited** – (ఆక్షన్ టైగర్), హెల్ప్‌లైన్ నం.లు: 9173528727 & 63518 96643, శ్రీ మౌలిక్ శ్రీమాలి ఇ-మెయిల్ ఐడి: **maulik.shrimali@auctiontiger.net** ని సంప్రదించవచ్చు మరియు ఏదైనా ఆస్తి సంబంధిత ప్రశ్నల కోసం పైన పేర్కొన్న విధంగా అధీకృత అధికారిని సంప్రదించవచ్చు. 8) ఎటువంటి కారణం చూపకుండానే ఏవైనా/అన్ని బిడ్‌లను తిరస్కరించే హక్కు అధీకృత అధికారికి ఉంది. ఉద్దేశిత బిడ్డర్ల నుండి స్వీకరించబడిన అన్ని బిడ్‌లు ఎంహెచ్‌ఎఫ్‌సిఎల్‌పై ఎటువంటి బాధ్యత/క్లెయిమ్ లేకుండా వారికి తిరిగి ఇవ్వబడతాయి. 9) హామీగా పెట్టిన ఆస్తిని తిరిగిపొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, సర్ఫేశీ చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ 8లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది. 10) ఇక్కడ షెడ్యూల్ చేయబడిన వేలం ఏదైనా కారణం చేత విఫలమైతే, సెక్యూర్డ్ క్రెడిటార్ ప్రైవేట్ ఒప్పందం ద్వారా అమ్మకం నిర్వహించి సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ను అమలు చేయవచ్చని దయచేసి గమనించండి. 11) అమ్మకానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి మా వెబ్‌సైట్ https://muthoothousing.comమరియు ఎం/ఎస్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్ టైగర్) యొక్క వెబ్‌పోర్టల్ https://muthoothousing.com-(ఆక్షన్ టైగర్) మరియు యొక్క వెబ్ పోర్టల్ https://sarfaesi.auctiontiger.net/EPROC/ చూడండి.
ఇందుమూలంగా రుణగ్రహీతలు/హామీదారు(లు)/తనఖాదారు(లు లకు సర్ఫేశీ చట్టంలోని సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనల్లోని రూల్ 8 & 9 ప్రకారం చట్టబద్ధ 30 రోజుల నోటీసు ఇవ్వడమైనది.

ప్రదేశం: తూర్పుగోదావరి, తేదీ: 29-జనవరి-2025 **సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున**

ఏఐవైఎఫ్ కాకినాడ జిల్లా కార్యదర్శిగా వై బాబి

విశాలాంధ్ర - కాకినాడ : అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ కాకినాడ జిల్లా ప్రథమ మహాసభ కాకినాడ ఎన్టీయూభవన్‌లో మంగళవారం జరిగింది. ఈ మహాసభలో కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా యు. నాని బాబు(పిఠాపురం), ఉపాధ్యక్షుడిగా సిహెచ్ గీత(పిఠాపురం), ఉపాధ్యక్షులుగా గోనెల నాగభూషణం(కాకినాడ రూరల్), ఉపాధ్యక్షుడిగా వి లోవ (పిఠాపురం), కార్యదర్శిగా వై బాబి (కాకినాడ), సహాయ కార్యదర్శిగా రాజువర్ధన్, ఏఐఎస్ఎఫ్, సహాయ కార్యదర్శిగా నాని సూరంపూడి(కాకినాడ), సహాయకార్యదర్శిగా మానెడ్డి వీరబాబు(పెద్దాపురం), కోశాధికారిగా పొన్నాడ దుర్గాప్రసాద్(కాకినాడ రూరల్)గా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీకి ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎన్ లెనిన్ బాబు, పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, ఏఐటీయుసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సీపీఐ నగర కార్యదర్శి టి అన్నవరం, సీపీఐ కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, పలువురు నూతన కమిటీకి శు భాకాంక్షలు తెలియజేశారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - పెనుమంట్ర: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొనేందుకు జనవరి 31న ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు పెనుగొండ శ్రీ నగరేశ్వర, మహిషాసురమర్దిని, శ్రీ వాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంను సందర్శించనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి హెలిప్యాడ్ ప్రాంతాన్ని బుధవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, జెసి రాహుల్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి సెక్యూరిటీ పర్యవేక్షకులు అడిషనల్ ఎస్పీ రమణ తదితరులు పరిశీలించారు. పెనుగొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న హెలిపాడ్ కాంక్రీట్ పనులను పరిశీలించి ఆర్ అండ్ బి అధికారులకు తగు సూచనలు చేశారు. అదే ప్రాంగణంలో ప్రముఖులు, అతిపెద్ద ప్రముఖులు రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసేందుకు ఏర్పాటు చేస్తున్న ఎల్-వన్, ఎల్ -టు ప్రాంతాలను సందర్శించి తగు సూచనలు చేశారు. మార్కెట్ యార్డు ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని డిపిఓను ఆదేశించారు. అనంతరం శ్రీ నగరేశ్వర, మహిషాసురమర్దిని శ్రీ వాసవికన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానంను సందర్శించి నగరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం, ఆలయానికి ఆనుకుని ఉన్న నిత్యాన్నదాన సత్రం ప్రాంగణంలో జనవరి 31న హోమం నిర్వహించే ప్రాంతాన్ని సెక్యూరిటీ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం శ్రీ వాసవి శాంతి ధామ్ ఋషి గోత్ర సువర్ణ మందిరాన్ని సందర్శించి ఆలయ ట్రస్టీ డాక్టర్ పిఎన్ గోవిందరాజులుతో శాంతి ధామ్‌లో నిర్వహించే కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం అధికారులతో సమావేశమై కార్యక్రమం ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు, జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, ముఖ్యమంత్రి సెక్యూరిటీ పర్యవేక్షకులు అడిషనల్ ఎస్పీ రమణ, ఆర్డీఓలు దాసిరాజు, ఖతీబ్ కౌసర్ భానో, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఇ.వి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జంగారెడ్డిగూడెం అధ్యక్ష, కార్యదర్శులుగా రమ్యశ్రీ, శేఖర్

విశాలాంధ్ర ఏలూరు: జంగారెడ్డిగూడెం మండల ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్. రమ్యశ్రీ, ఎం. శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్, జిల్లా కోశాధికారి ఎం క్రాంతి కుమార్ మీడియాకు బుధవారం జంగారెడ్డిగూడెం జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ కమిటీ సభ్యులుగా కె. రమ్యశ్రీ, పి. లక్ష్మీ, ఏ. ద్రాక్షయిని,కె. సతీష్,డి. ప్రశాంత్,వై. హర్ష విద్యార్థులను ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు రమ్యశ్రీ, శేఖర్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలంలో విద్యారంగ సమస్యలు పరిష్కారానికి అగ్రభాగాన ఉండి పోరాడతామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఏఐఎస్ఎఫ్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార అభివృద్ధి, ప్రయోజనాలపై అవగాహన : జేసీ

విశాలాంధ్ర - కాకినాడ : భారత ప్రభుత్వం 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించడంతో ఈ సంవత్సరం సహకార అభివృద్ధి, సహకార సంఘాల ప్రయోజనాలపై సభ్యులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్ణయించింది. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధ్యక్షతన వ్యవసాయ అనుబంధ రంగాలు, జిల్లా సహకార బ్యాంక్, మార్కెటింగ్, పౌరసరఫరాలు, నాబార్డు తదితర శాఖల అధికారులతో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ..భారత ప్రభుత్వం 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ఈ నేపథ్యంలో సహకార శాఖ ద్వారా సహకార అభివృద్ధి, సహకార సంఘాలకు కలిగి ప్రయోజనాలపై సభ్యులకు విస్తృత అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలవారీగా సంవత్సరం మొత్తానికి రూపొందించిన కార్యాచరణ ప్రణాళికపై సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కొత్తగా ప్రాథమిక వ్యవసాయ, మత్స్యకార, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఏర్పాటు చేయుటకు గల అవకాశ ములు పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మిగిలిన ప్రాథమిక సంఘాల కంప్యూటరీకరణ పనులు వేగవంతం చేసి నిర్దేశించిన గడువులకు పనులు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులకు సూచించారు. సమావేశంలో డీసీవో జి వెంకటకృష్ణ, పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశ్ రావు, మత్స్య శాఖ జేడీ కె కరుణకర్, జిల్లా సహకార బ్యాంకు సీఈవో నరసింహారావు, నాబార్డ్ ఏజీఎం వై సోమనాయుడు, డీఎస్వో లక్ష్మీ ప్రసన్న దేవి, మార్కెటింగ్ డీఈ వెంకట రాజారావు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: జిల్లాలో మార్చి 1 నుంచి ఇంటర్మీడియెట్ థియరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 55 పరీక్షా కేంద్రాల్లో మార్చి 1 నుంచి మార్చి 20 వరకు ఉదయం గం.9నుంచి మధ్యాహ్నం గం.12వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామని, పరీక్షలకు 33,511 మంది విద్యార్థులు హాజరుకా నున్నట్లు చెప్పారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రా లకు చేరడానికి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత బస్సుల కండిషన్‌లో ఉండేటట్లు చూసుకోవా లన్నారు. కొన్ని అదనపు బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ 08812-230197 ఫోన్ నెంబరుతో ఏర్పాటు చేశారని, దీంతో పాటు కలెక్టరేట్, పోలీస్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం ఏర్పాట్లను ప్రతిరోజు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి (ఆర్ఐఓ) కె. చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి 20వ వరకు 29 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్ (ఒకేషనల్), ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు 69 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్ (జనరల్) పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్.పి. ఎన్.సూర్యచం ద్రరావు, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, ఆర్ఐఓ కె. చంద్రశేఖర్ బాబు,డివిఇవో బి.ప్రభాకరరావు, డిఇసి కమిటీ సభ్యులు కె. యోహాన్,ఎల్. శ్యామ్ కుమార్, బి.వి. శ్రీనివాస్, పి. జ్యోతి,డిఇఒ వెంకటలక్ష్మమ్మ, డిపివో కె.అనురాధ, పోస్టల్, వైద్య ఆరోగ్యశాఖ, ట్రాన్స్ కో,తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలి: రవి ప్రకాష్

విశాలాంధ్ర - కొవ్వూరు : ప్రజా ఉద్యమంలో తన కలంతో గళం విప్పి, ప్రజా చైతన్యాన్ని తీసుకువచ్చి,నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేసిన మహా యోధుడు ప్రజా కవి గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ అధ్యక్షులు బొంత శ్యామ్ రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభు త్వం ప్రకటించిన పద్మ అవార్డులపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, విష్ణువర్ధన్ రెడ్డి ప్రజా కవి గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల బుధవారం బొంత శ్యామ్ రవి ప్రకాష్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డులు బీజేపీ పార్టీకి చెందినవి కాదని గుర్తు చేశారు. పద్మా అవార్డులు ఎంపికలో కమిటీ ఉంటుందని ఆ కమిటీ సిఫార్సు చేసిన వారికి అవార్డులను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఇది కేవలం బిజెపి మాత్రమే ఇచ్చిన అవార్డులుగా బండి సంజయ్ మాట్లాడడం సబబు కాదన్నారు. చనిపోయిన వ్యక్తిపై ఇష్టానుసారంగా మాట్లాడిన బండి సంజయ్, విష్ణువర్ధన్ రెడ్డి ప్రజా కవి గాయకుడు గద్దర్ కుటుంబానికి అభిమానులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు మండల పరిషత్ సమావేశ మందిరం నందు ఉదయం 9:30 గంటలకు మండల పరిషత్ అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రాథమిక, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పాలకోడేరు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పిటిసి సభ్యులు హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీడీవో వి. రెడ్డయ్య మాట్లాడుతూ మండల స్థాయిలో గ్రామ పంచాయితీ అభివృద్ధి సంబంధించి, మండల అభివృద్ధికి సంబంధించి మెరుగైన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే పరిపూర్ణమైన ప్రణాళికలను రచించుకోవాలని అందువలన గ్రామస్థాయిలోను, మండల స్థాయిలోనూ ఉన్న ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి ఈ శిక్షణ కార్యక్రమంలో పాలు పంచుకోవడం వల్ల గ్రామాల, మండల అభివృద్ధికి తమవంతుగా సహాయపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి రాంప్రసాద్, సంబంధిత మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో పవన్ కళ్యాణ్ చిత్రపటం పెట్టాలి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ఏలూరు నియోజకవర్గంలోని పలు సచివాలయాల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటం లేకపోవ డాన్ని నిరసిస్తూ జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ సచివాలయాల తనిఖీల్లో కొన్ని సమస్యలను గుర్తించడం జరిగిందని, వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ భాను ప్రతాప్ కి వివరించారు. ఏలూరు జనసేన పార్టీ ఇంచార్జ్ రెడ్డి అప్పలనాయుడు సూచనల మేరకు ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సచివాలయాలను జన సైనికులు, నాయకులతో కలిసి పరిశీలించగా కొన్ని ప్రదేశాలలో ప్రభుత్వ జీవో ఇచ్చినప్పటికీ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటం లేకపోవడాన్ని గుర్తించడం జరిగిందన్నారు. అలాగే కొన్ని సచివాలయాల్లో ప్రజలకి ఏవైనా అవసరమైన సర్టిఫికెట్లు కోసం వెళ్తే కంప్యూటర్ మరియు ప్రింటర్లు పనిచేయడం లేదన్నారు. అందువల కమిషనర్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజల సౌకర్యార్థం, ప్రతి సచివాలయంలో కంప్యూటర్ మరియు ప్రింటర్లను మరమ్మత్తులు చేయించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ భాను ప్రతాప్ సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరిస్తానని హామీని ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, నాయకులు బుద్ధ నాగేశ్వరరావు, వీరబాబు తదితరులు ఉన్నారు.

గౌరీ పార్వతికి సన్మానం



విశాలాంధ్ర- తాడేపల్లి గూడెం : మునిసిపల్ 17 వార్డ్ కు చెందిన అంగన్వాడీ టీచర్ గౌరీ పార్వతి జాతీయ స్థాయిలో ఉత్తమ అంగన్వాడి వర్కర్ అవార్డును సెంట్రల్ మినిస్టర్ మహిళా శిశు సంక్షేమ శాఖ వారి చేతుల మీదుగా రిపబ్లిక్ డే రోజున న్యూఢిల్లీలో అందుకున్నారు. బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఆమెకు ప్రభుత్వ విప్, ఎమ్ ఎల్ ఏ, కూటమి నాయకులు చిరు సత్కారం చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పశ్చిమగోదా వరి జిల్లా నుంచి మన తాడేపల్లి గూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు ,తాడేపల్లిగూడెం 1 సెక్టార్‌కి చెందిన 17 వార్డ్ 2 అంగన్వాడీ టీచర్‌కి రావడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ టి ఎల్ సరస్వతి,సెక్టర్ సూపర్వైజర్, సిహెచ్ దుర్గ, భవాని, ఆఫీస్ స్టాఫ్ కూటమి నాయకులు ఈతకోట తాతాజీ, పాలూరి వెంకటేశ్వరరావు, అడపా ప్రసాద్,గొర్రెల శ్రీధర్, బయనపాలెపు ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల తయారీపై అవగాహన కలిగించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లా విభిన్న ప్రతిభావంతుల పునరావాస కేంద్రం, ఏలూరు జిల్లా డి .ఎం. టి సమావేశం బుధవారం కలెక్టరేట్ లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె . వెట్ సెల్వి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏలూరు జిల్లా లో దొండపాడు నిర్వహించబడుతున్న జిల్లా పునరావాస కేంద్రం ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ద్వారా జిల్లా లోని అవసరత కలిగిన దివ్యాంగుల అందరూ ఉచి తంగా ఫిజియోథెరపీ, క్యాలిపర్స్,ముగ్గు కృత్రిమ అవయవాల తయారు చేయించుకుని లబ్ధి పొందే లాగా జిల్లా అంతట అవగాహన కార్యక్రమాలు

నిర్వహించాలని దానికి సంబంధించిన సమాచా రాన్ని ముందుగానే సంబంధిత అధికారులకు తెలియజేసి ,ఎక్కువమంది ప్రజలు హాజరయ్యేలాగా ప్రచార కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ప్రగతి పథంలో నడుపుటకు తీసుకోవలసిన చర్యలపై చర్చించడం జరిగింది. జూలై 2024 నుండి జనవరి 25 వరకు నిర్వహించిన అవగా హన సదస్సులు నివేదికలను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు.ఇంకను ఇతర వివరాల కొరకు స్వయంగా కానీ ఫోన్ సంఖ్య 08812-249297, మరియు 7386565469 నకు సంప్రదించి సదరు సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ప్రతిభావంతుల ,హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు బి .రామ్ కుమార్, డిపిఓ. కె .అనురాధ ఐసిడిఎస్ పిడి శారద, ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఇన్ ఫ్లాంటింగ్ ఏజెన్సీ పెద్దిరెడ్డి, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, మెడికల్ అండ్ హెల్త్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వాతంత్ర్యమే విభిన్న ప్రతిభావంతుల ఉన్నతికి దోహదం

- జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్, కలెక్టర్, ఎమ్మెల్యే

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ఆర్థిక స్వాతంత్ర్యమే విభిన్న ప్రతిభావంతుల ఉన్నతికి పూర్తిస్థాయిలో దోహదపడుతుందని, ఆ దిశగా వారిని ప్రోత్సహించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి స్పష్టం చేశారు. ఏలూరు రైల్వేస్టేషన్ సమీపం లోని గిరిజన యువత శిక్షణా కేంద్రంలో బుధ వారం విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక జాబ్‌మే ళాను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన వివిధ సంస్థల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులకు ప్రతిభ ఆధారం గా ఎంపికలను నిర్వహించారు. ఈ క్రమంలో అక్కడ నిర్వహించిన సభలో ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీలు పాల్గొని దివ్యాంగుల్లో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాకు మంచి ప్రభుత్వ పాలనా యంత్రాంగం, గొప్ప

రాజకీయ నాయకత్వం లభించడం అదృష్టమని అభి ప్రాయపడ్డారు. పిజిఆర్‌ఎస్‌లో అనేక మంది విభిన్న ప్రతిభావంతులు తనను కలిసి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారన్నారు. దీంతో వివిధ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో కూడా అర్హతల బట్టీ వారికి ప్రాధాన్యత కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని, అలాగే వారు చేయాలనుకునే వ్యాపారానికి కూడా అన్నివిధాలా సహకారం అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి బాధ్యతాయుతంగా పనిచేస్తున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతులు వారి కాళ్ళ మీద వారు నిల బడేందుకు అన్ని విధాలా తోడ్పాటు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని భరోసా కల్పించారు. వారి ఉన్నతిని చూసి సమాజం లోని ప్రతి ఒక్కరూ గర్వ పడి స్ఫూర్తిని పొందేస్థా యికి దివ్యాంగులు చేరు కోవాలని ఎమ్మెల్యే చంటి ఆకాంక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ దివ్యాంగు లెవ్వరూ అధైర్య పడొద్దని, ఇప్పుడు ఉపాధి పొందకపోయినా నిరుత్సాహ పడొద్దని, ప్రతి 6 నెలలకు ఒకసారి జరిగే జాబ్ మేళాల్లో తమ సత్తా చూపి కొలువులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ పిడి డాక్టర్ ఆర్.విజయరాజు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, నెహ్రూ యువకేంద్రం అధికారి దూలం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలి

ట్రాఫిక్ సిఐ నారాయణమూర్తి

విశాలాంధ్ర - భీమవరం : ద్విచక్ర వాహనాల డ్రైవింగ్ వల్ల ఎక్కువ శాతం మరణాలు సంభవిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ సురక్షితంగా గమ్యాలను చేరుకోవాలని ట్రాఫిక్ సిఐ వి.నారాయణమూర్తి అన్నారు. 36వ జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా ఆర్.ఆర్.డి.ఎస్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్.విభాగం ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడిప రాదని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మట్ ధరించాలని పేర్కొన్నారు. విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షులు అల్లు శ్రీనివాస్, అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో మన ప్రాణాలను మనకు మనమే కాపాడుకోవాలని, జాతీయ రహదారి భద్రత మాసోత్సవం సందర్భంగా పట్టణంలోని వివిధ కళాశాలలో, ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, డాక్టర్ పి.రాజశేఖర్, డాక్టర్ ఎ.అరవిందస్వామి, ఎల్.నరసింహారావు, పి.అమ్ములురావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర - గణపవరం : గ్రామాలలో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామపంచాయతీలు పని చేయాలని గణప వరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిణి ఆర్. బేబీ శ్రీలక్ష్మి అన్నారు. గణపవరం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీ మీద ప్రజాప్రతి నిధులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ జెడ్పీటీసీలతోపాటు ఎంపీటీసీ సభ్యులకు గ్రామ సర్పంచులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయాలని గ్రామాల్లో స్వయం సమృద్ధికి పాటు గ్రామాల్లోని బాలసభలు మహిళా సభలు వార్డు సభ్యులకు తప్పనిసరిగా తెలియజేయా లని పంచాయతీల విస్తరణ అధికారి (ఇపిఆర్డి) పల్లి వెంకట సత్యనారా యణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కందుల రూపేష్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ కె.దుర్గాప్రసాద్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.తులసి తదితరులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై ఎమ్మెల్యేను కలిసిన స్థానికులు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో పలు సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను ప్రజలు కలిశారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కూటమి నాయకులు బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈతకోట తాతాజీ, పాలూరి వెంకటేశ్వరరావు, అడపా ప్రసాద్,గొర్రెల శ్రీధర్, బయనపాలేపు ముఖేష్ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

మండలపు ప్రసాదరావు సతీమణి మృతి

కాపా ,మోరంపూడి సంతాపం

విశాలాంధ్ర - చాట్రాయి : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వయోవృద్ధులు సికె పడు సప్లై ఛానల్ సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు మండలపు ప్రసాదరావు సతీమణి సరోజిని గుండె పోటుతో మృతి చెందారు. బుధవారం చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన సరోజని తెలియడంతో నూజివీడు ఏఎంసి మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాస్ రావు కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు తెలుగుదేశం పార్టీ చాట్రాయి మండల మాజీ అధ్యక్షులు చిట్టిబాబు, మండల ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు తదితరులు. ఆమె భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మండలపు ప్రసాదరావు కుటుంబం పార్టీకి మంచి సేవలు అందించింది అన్నారు . తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ. మండలపు కుటుంబం సేవలు మరువలేనివి అన్నారు. కృష్ణ మిల్క్ యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు మాట్లాడుతూ. నాయకులు మండలపు ప్రసాదరావు సతీమణి మరణం తీరని లోటు అన్నారు. నేతలు అందరూ మండలపు ప్రసాదరావు మండలపు జగదీష్‌ను పరామర్శించి ఓదార్చారు.

ఉత్సవాలకు టిక్కెట్ల గోల

విశాలాంధ్ర - పోలవరం : ఫిబ్రవరి 26 న పట్టిసంలో జరిగే శ్రీభద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఉత్సవాలకు రేవు దాటడానికి మరో రూ. 10 పెంచడంతో వైసీపీ నాయకులు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, రాజబాబు, బుజ్జులు, దొరబాబు, సూర్యనారాయణ పంచాయితీ అధికారులపై ఒక్కసారిగా ధ్వజమెత్తారు. పంచాయితీ బోర్డు మెంబర్లు బోర్డు తీర్మానం చేసుకుంటే సరిపోతుందా, గ్రామ సభ పెట్టి గ్రామ తీర్మానం తర్వాతనే రేటు పెంచుకోవాలని తెలిపారు.రేవు పాటదారుడు పాట పాడుకునే సమయంలో రేటు పెంచితే పాట ఎక్కువగా పాడుకుంటారని పంచాయితీ ఆదాయం వస్తుంది.కానీ మీరు ఉత్సవాలు మూడు రోజులకు ఇప్పుడు రేట్లు పెంచడం మంచిది కాదని నిలదీశారు. ఇప్పటిదాకా ఉన్న రూ.30 టిక్కెట్టు మరో రూ.10 పెంచడంతో ఇది భక్తులపై భారం పడుతుందని,ఇక్కడకు వచ్చే భక్తులు చాలా దూరం నుండి వస్తారని వారిపై టిక్కెట్ భారం పెట్టకూడదన్నారు.దీంతో జనసేన నాయకులు మాట్లాడుతూ పెంచిన రూ. 10 పంచాయితీకి ఇవ్వడం జరుగుతుందని, దీంతో పంచాయతీకి కొద్దిపాటి ఆదాయం వస్తుందని ఇది ఉత్సవాలు ఖర్చుకు ఉపయోగించుకోవచ్చన్నారు.పట్టిసీమ ఉత్సవాలకు మీరు న్యాయం చేస్తున్నట్టు మేము అన్యాయం చేస్తున్నట్లు ఉందని కొద్దిసేపు వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆర్డిఓ ఎంవి రమణ, తహసీల్దార్ సాయి రాజు, ఏవో శ్రీనివాస్ ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఉన్నారు.

అమరావతికి దివ్యాంగుడి సైకిల్ యాత్ర

- డిప్యూటీ సీఎం పవన్‌ను కలవడానికి ప్రయాణం

విశాలాంధ్ర - రాజానగరం : పవన్ కళ్యాణ్ అంటే అతనికి పంచప్రాణం, ఆపై ఎనలేని అభిమానం. తన అభిమాన హీరో, రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కలవాలనే పట్టుదలతో తన దివ్యంగత్వాన్ని సైతం లెక్కచేయకుండా పవన్ కళ్యాన్ని కలిసేందుకు మూడోసారి సైకిల్ పై యాత్ర చేపట్టాడు. వివరాల్లోకి వెళ్తే అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొర పాలెం గ్రామానికి చెందిన కొల్లిమల్ల పెంటారావు పుట్టికతో దివ్యాంగుడు (చెవిటి, మూగవాడు) పవన్ కళ్యాణకు ఆయన వీరభిమాని,దీంతో ఏపీ డిప్యూటీ సిఎం ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ తన స్వగ్రామమైన పొట్టిదొరపాలెం నుండి సైకిల్ యాత్రను ఈ నెల 26న చేపట్టాడు.రోజుకి సుమారు వంద కిలోమీటర్లు సైకిల్ తొక్కుతూ యాత్ర కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్గమధ్యంలోని రాజానగరం వద్దకు బుధవారం చేరుకున్నాడు. ఈ సందర్భంగా విశాలాంధ్ర తో అతని బంధువులు సహాయంతో చారవణిలో మాట్లాడించాడు.మొత్తం యాత్రలో 350 కిలోమీటర్లు సైకిల్ తొక్కడం జరుగుతుందని చెప్పారు. పవన్ కళ్యాణ్ను కలసేవరకు అమరావతిలోనే ఉంటానని ఈ అతని బంధువుల ద్వారా చెప్పారు. 2024 ఎన్నికల ముందు పవన్ కళ్యాణ్ గెలవాలని, డిప్యూటీ సిఎం అవ్వాలని మొక్కుకుని పొట్టిదొరపాలెం నుండి అయోధ్య వరకు సైకిల్ యాత్ర చెప్పాటి తన మొక్కును చెల్లించుకున్నాడని చెప్పారు.పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సనాతన ధర్మం కోసం మాట్లాడినప్పుడు మరోసారి పెంటారావు సైకిలు ఒకవైపు జాతీయ జెండా, మరోవైపు సనాతన ధర్మం చాటుతూ జెండా కట్టి దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాలు సైకిల్ యాత్ర చేసి అన్ని దేవస్థానాలను దర్శించు కోవడం జరిగిందన్నారు. మూడో సారి యాత్ర చెప్పటి పవన్ కళ్యాణ్ కలుసుకొని తాను సభ్యులుగా ఉన్న వియస్ఆర్ చారిటబుల్ ట్రస్టు వివరాలు వెల్లడిస్తారని అతని బంధువులు ద్వారా తెలిపారు.

అప్పారావుకు ఆర్థిక సాయం అందజేత

టీడీపీనేత రెడ్డి అమర్నాథ్ చౌదరి

విశాలాంధ్ర - ప్రత్తి పాడు : మండలంలోని పెద్దిపాలెం గ్రామానికి చెం దిన రాళ్ల అప్పారావు ఇటీ వల తీవ్ర అనారోగ్యానికి గురయ్యి బాధపడుతున్న అప్పారావు కుటుంబాన్ని స్థానిక టిడిపినేత రెడ్డి అమర్నాథ్ చౌదరి పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే అప్పారావుకి మెరుగైన వైద్యం అందేలాగా చూడాలని వైద్య అధికారులతో మాట్లా డి హామీ ఇచ్చారు. పుట్ట వీర్రాజు(బాబి) చౌదరి, రీసు సత్తిబాబులు కూడా పరామర్శించారు.

ఎమ్మెల్యే నానాజీ చొరవతో ఎత్తిపోతల పథకం ప్రారంభం

విశాలాంధ్ర - కరప : కరప మండలం వేములవాడ, కొంగోడు, గొర్రిపూడి గ్రామాల రైతులకు బుధవారం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి అధి కారులు నీటి సరఫరా చేశారు. సోమ వారం రైతులు కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీతో కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు ఎలక్ట్రికల్ అధి. కారులు వ్యవసాయ అధికారులు సారథ్యంలో ఎత్తిపోతల పథకాన్ని బుధవారం రైతులు అందించారు. ఈ పథకం ద్వారా సుమారు 700 ఎకరాల ఆయకట్టుకు నీరు అందిస్తున్నారు. దీంతో ఆ గ్రామాల రైతులు ఎమ్మెల్యే పంతం నానాజీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏడిఏ బాబురావు, ఎలక్ట్రికల్ ఏఈ సానా ఈశ్వర ప్రసాద్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఈల మింగిన బాలుడుకి శస్త్రచికిత్స

విశాలాంధ్ర - రాజానగరం : స్నేహితులతో ఆటలాడుతూనే ఓ బాలుడు ఈల మింగిన ఘటన ఆ కుటుంబాన్ని అయోమయం స్థితిలోకి నెట్టింది. ఎంచెయ్యాలో ఎక్కడికి తీసుకు వెళ్లలో దిక్కుతోచని పరిస్థితుల్లో మండలంలోని జి ఎస్ ఎల్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఈ ఘటనకు సంబంధించి జిఎస్ఎల్ పీడి యాట్రిక్ సర్జన్ డాక్టర్ వెంకటేష్ కొల్లా విశా లాంధ్రతో మాట్లాడుతూ కోనసీమ జిల్లా రావుల పాలెం గ్రామానికి చెందిన నాలుగున్నర ఏళ్ళ వయ స్సున్న బాలుడు ఆటలో ఈల ఊదుతూ గట్టిగా లోపలికి ఊపిరి పీల్చి, ప్రమాదవశాత్తూ ఆ ఈలను మింగేశా డ న్నారు. దీంతో ఉక్కిరిబిక్కిరి అయ్యి దగ్గుఆగక, ఊపి రి ఆడక, సతమతమౌతున్న ఆ అబ్బాయిని జిఎస్ ఎల్ జనరల్ హాస్పిటల్ రెండు రోజులు క్రితం రాత్రి వేళలో తల్లిదండ్రులు తీసుకువచ్చారన్నారు. దీంతో తమకు సమాచారం రావడంతో వెంటనే ఆ అబ్బాయికి ఎక్స్ రే ద్వారా పరీక్షించి, ఈల కుడివైపు ఊపిరితిత్తిలో ఉన్నట్టు గుర్తించారన్నారు. తమ బృందంతో పాటు అనస్తీ షియా (మత్తు వైద్యులు) ప్రశాంతి సహాయంతో పీడియాట్రిక్ బ్రాంకో స్కోపీద్వారా సుమారు గంటకి పైగా శ్రమించి ఈలను సురక్షితంగా బయటికి తీశామన్నారు. శస్త్రచికిత్స అనంతరం 24గంటలు పాటు తమ పరిశీలనలో పెట్టుకొని బాలుడు సురక్షితంగా ఉన్నాడని నిర్ధారణ చేసుకున్న తర్వాత డిశ్చార్జ్ చేయమన్నారు. జిఎస్ఎల్ విద్యాసంస్థలు అధినేత,ప్రముఖ సర్జన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ సున్నితమైన, కష్టతరమైన శస్త్రచికిత్సను ఆధునిక పరికరాలు వినియోగించి విజయవంతంగా పూర్తి చేసిన వైద్యులు వెంకటేష్ కొల్లాతో పాటు వైద్య బృందాన్ని అభినందించారు.

కోళ్ల పెంపకంలో జీవ భద్రతా చర్యలు

విశాలాంధ్ర-ఘంటసాల: ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేం ద్రంలో మహిళా రైతులకు పెరటి కోళ్ల పెంపకంపై నైపుణ్యత శిక్షణా కార్యక్రమములో భాగంగా 3వ రోజు కోడి పిల్లలలో చేపట్టవలసిన మేత యాజమాన్య పద్ధ తులు, టీకా (వ్యాక్సిన్)లు ఎప్పుడు వేసు కోవాలి, వాడే విధానం టీకాలు ద్వారా అకస్మాత్తుగా వచ్చే మరణాల రేటు తగ్గించవచ్చు అని విస్తరణ శాస్త్రవేత్త డా బి. నవీ న్ తెలియజేశారు. కోళ్ల పెంపకంలో పాటిం చవలసిన జీవ భద్రత చర్యలు గురించి గృహ విజ్ఞాన శాస్త్రవేత్త, జి. కృష్ణవేణి తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో కె. వి కె శాస్త్రవేత్తలు మహిళా రైతులు పాల్గొన్నారు.

శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ క్యూ3, 9 ఎమ్ఎఫ్‌వై25లో అద్భుతమైన పనితీరును

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట :%-% శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ డిసెంబర్ 31, 2024తో ముగిసిన త్రైమాసికం తొమ్మిది నెలల ఆర్థిక ఫలితాలను ప్రకటించిందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. శక్తి పంప్స్ (ఇండియా) లిమిటెడ్ చైర్మన్ దినేష్ పాటిదార్, కంపెనీ పనితీరుపై మాట్లాడుతూ "మా కంపెనీ ప్రతిష్టాత్మకమైన "గ్రేట్ ప్లేస్ టు వర్క్" సర్టిఫికేషన్‌ను సంపాదించిందని పంచుకోవడానికి నేను సంతోషంగా ఉన్నానన్నారు. ఇది మా బలమైన మరియు ప్రేరేపిత బృందానికి నిదర్శనమన్నారు. ఇది కంపెనీ స్థిరమైన వృద్ధికి దోహదపడిందన్నారు. ఆర్డర్‌ల అమలు కార్యాచరణ సామర్థ్యాల పెరుగుదల ద్వారా కంపెనీ బలమైన మొత్తం ఆర్థిక పనితీరును అందించిందన్నారు. దీని ఫలితంగా గణనీయమైన మార్జిన్ విస్తరణ కూడా జరిగిందన్నారు. మాగెల్ త్యాలా సౌర్ కృషి పంప్ పథకం వంటి పీఎం కుసుమ్ పథకం వెలుపల ఆర్డర్‌ల వైవిధ్యంతో, మేము మా వృద్ధి అవకాశాల గురించి నమ్మకంగా ఉన్నామన్నారు. రూ. 750 బిలియన్ల పెట్టుబడి వ్యయంతో మద్దతు ఇవ్వబడిన పీ ఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన" వంటి ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా బలోపేతం చేయబడిన సౌర పైకప్పు ఒక ఆశాజనక అవకాశాన్ని అందిస్తుందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల కోసం ఎలక్ట్రిక్ మోటార్లు %౮% కంట్రోలర్ల తయారీలోకి ప్రవేశించడం ద్వారా మేము వ్యూహాత్మకంగా మా వ్యాపార నమూనాను వైవిధ్యపరిచామన్నారు. మా ఎగుమతి వ్యాపారం కూడా బలమైన పనితీరును అందించిందన్నారు.